నీలగిరి నిత్యపద్యం
కందం

రాముడు కారణజన్ముడు
రాముడు దశరథ తనయుడు,రాజసమొప్పన్
రాముడు రఘుకులతిలకుడు
రాముడు ధర్మాత్ముడయ్యి రాజ్యమునేలెన్

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు, కవి


RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 147 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 24-8-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## రోదసి అన్వేషణకు సిద్ధం కండి

- భారత శాస్త్రవేత్తలకు మోదీ పిలుపు

న్యూఢిల్లీ
అంతరిక్ష శాస్త్రవేత్తలకు కొత్త ఛాలెంజ్ విసిరారు ప్రధాని మోదీ. రోదసి అన్వేషణ చేపట్టాలని ఆయన కోరారు. మానవాళి భవిష్యత్తు కోసం అంతరిక్ష రహస్యాలను ఛేధించాలని ఆయన శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ సందేశం వినిపించారు. ఆయన తన సోషల్ మీడియాలో ఇవాళ ఓ వీడియోను పోస్టు చేశారు. భవిష్యత్తులో చేపట్టబోయే అంతరిక్ష ప్రయోగాల కోసం ఆస్ట్రోనాట్ల బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. యువత దీనిలో భాగం కావాలన్నారు. అతి సుదీర్ఘ దూరంలో ఉన్న గెలాక్సీలు, అంతరిక్షం అధ్యయనం చేయాలన్నారు. చంద్రుడి మీదకు, మార్స్ మీదకు వెళ్లామని, డీప్ స్పేస్ అంశంలో మరింత లోతుగా అన్వేషణ చేపట్టాలని, మానవాళికి ఉపయోగపడే అనేక రహస్యాలు అక్కడ

-మిగతా 2 లో



## ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ ఫ్రీ

- వాహనదారులకు గుడ్‌న్యూస్ చెప్పిన మహారాష్ట్ర ప్రభుత్వం..
- ఈ నిర్ణయం ఆగస్టు 22 నుంచి అమల్లోకి వచ్చినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ వెల్లడి

న్యూఢిల్లీ
వాహనదారులకు మహారాష్ట్రం సర్కార్ శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని టోల్‌ప్లాజాల వద్ద ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ మినహాయింపు కల్పిస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో ఐకానిక్ అటల్ సేతు , ముంబై-పూణె ఎక్స్‌ప్రెస్‌వే, సమృద్ధి మహామార్గ్ సహా కీలక రహదారులపై ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపింది. ఈ నిర్ణయం ఆగస్టు 22 నుంచి అమల్లోకి వచ్చినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ తెలిపారు. ఎలక్ట్రిక్ ఫోర్-వీలర్లు, ఈ-బస్సులను టోల్ టాక్స్ ఫ్రీ విధానం వర్తించనున్నట్లు పేర్కొన్నారు.కాగా, భారత్‌లో కాలుష్యం కోరలు చాస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం ఎంత ప్రమాదకరంగా మారిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎన్ని చర్యలు చేపట్టినా మార్పు రావడం లేదు. ముంబైలో కూడా పరిస్థితి నానాటికీ దిగజారుతోంది.

-మిగతా 2 లో




# ఓట్ చోరీపై రాష్ట్రంలోను నిరసనలు

### లోగోను ఆవిష్కరించిన సీఎం రేవంత్

- పార్టీపరంగా బీసీలకు 42 శాతం టికెట్లు
- బీసీ బిల్లుపై సుప్రీంలో సవాల్‌కు నిర్ణయం
- కేసీఆర్ సవరణతో బీసీలకు తీరని అన్యాయం
- గాంధీభవన్ సమావేశంలో సిఎం రేవంత్ వ్యాఖ్యలు

**హైదరాబాద్ ఆగస్టు23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఓట్ల చోరీ వ్యవహారంపై ఏఐసీసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఈ క్రమంలోనే ఓట్ల చోరీకి సంబంధించిన ప్రచార లోగోను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, పీఏసీ సభ్యులతో కలిసి లోగోను విడుదల చేశారు. ఓట్ల చోరీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల భాజపాపై విమర్శలు ఎక్కుపెట్టిన విషయం తెలిసిందే. ఓట్ల చోరీని అడ్డుకుందామని.. రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతిద్దామని

-మిగతా 2 లో





## హైడ్రా రాకతో తగ్గిన ఆక్రమణలు

- దేశంలో ఎక్కడా ఇలాంటి సంస్థ లేదు
- నాలాలను రక్షించంతో పాటు... ఆక్రమణలు తొలగిస్తున్నాం

హైదరాబాద్,ఆగస్టు23(నీలగిరి ఎక్స్ ప్రెస్)
హైదరాబాద్‌లో వరదలు, మురుగునీటి సమస్యలు, చెరువుల కబ్జాలు, పర్యావరణ సమస్యలు వంటి క్లిష్ట అంశాల పరిష్కారానికి ఒక ప్రత్యేక సంస్థ అవసరమని భావించిన ప్రభుత్వం, గత ఏడాది జూలైలో హైడ్రా అనే ప్రత్యేక సంస్థను ఏర్పాటు- చేసింది. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడుతూ సంస్థ పనితీరు, భవిష్యత్ దిశపై కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా లాంటి సంస్థ దేశంలో ఎక్కడా లేదు. ఇది కొత్త ప్రోగ్రామ్, కాబట్టి ఇంకా చాలా తెలుసుకోవాల్సి ఉంది. సిబ్బంది తక్కువ ఉన్నప్పటికీ, మేము బాగానే పనులు చేస్తున్నాం. తప్పులు జరిగితే వాటిని

-మిగతా 2 లో



## అమెరికాకు పోస్టల్ సేవలు బంద్

- భారత్ కీలక నిర్ణయం..
- ఆగస్ట్ 25 నుంచి అమెరికాకు పోస్టల్ సేవలు నిలిపివేత

న్యూఢిల్లీ ఆగస్టు23(నీలగిరి ఎక్స్ ప్రెస్)
భారత్ కీలక నిర్ణయం తీసుకున్నది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఆగస్ట్ 25 నుంచి అమెరికాకు పోస్టల్ సేవలు నిలిపివేయనున్నది.ఈ మేరకు తపాలా శాఖ శనివారం ప్రకటించింది. అమెరికా సుంకాలకు సంబంధించిన మార్పులు ఈ నెల చివరి నుంచి అమలులోకి రానున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 25 నుంచి ఆ దేశానికి పోస్టల్ కన్సైన్‌మెంట్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పోస్టల్ డిపార్ట్‌మెంట్ శనివారం

-మిగతా 2 లో

## ఓట్ చోర్ ఆందోళన మూర్ఖత్వం

- అలా అయితే తెలంగాణలో ఎలా గెలిచారు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు



హైదరాబాద్, ఆగస్టు23(నీలగిరి ఎక్స్ ప్రెస్)
బిహార్ ఎన్నికల్లో మంచి వాతావరణం ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, ఆర్జేడీకి ఒక ఎజెండా అంటూ ఏమీ లేదని విమర్శించారు. రాహుల్‌గాంధీ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. ఆయన ఎందుకు ఆందోళన చేస్తున్నారో తెలియరకాంగ్రెస్ వారే గదరగోళానికి గురవుతున్నారని అన్నారు. ఓట్ చోరీ

-మిగతా 2 లో



## మంచి చేస్తుంటే అడ్డుపడడం సహజం

- మూసీ పునరుద్ధరణలో వెనక్కి పోము
- మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ

హైదరాబాద్,ఆగస్టు23(నీలగిరి ఎక్స్ ప్రెస్)
సాధారణంగానే ఏదైనా మంచి పని చేసేటప్పుడు కొందరూ కావాలనే అడ్డుపడుతుంటారని మూసీ విషయంలోనూ ఇదే జరుగుతోందని, భావి తరాల కోసం నీటి వనరుల పరిరక్షణలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణను రోల్ మోడల్ గా నిలుపుతామని మంత్రి శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ రీజినల్ ఛాప్టర్ ఆధ్వర్యంలో శనివారం

-మిగతా 2 లో



## మీకు సమస్య ఉంటే మా ఉత్పత్తులు కొనకండి

- పాక్, అమెరికాల బంధంపైనా కామెంట్స్
- ట్రంప్ సుంకాలపై జైశంకర్ ఘాటు వ్యాఖ్యలు
- ఢిల్లీలో జరిగిన సదస్సులో పాల్గొన్న జైశంకర్

న్యూఢిల్లీ
రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దంటూ భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు సుంకాలు విధించడంపై భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఘాటుగా స్పందించారు. భారత్ నుంచి చమురు, రిఫైన్డ్ ఉత్పత్తులు కొనుగోలుపై ఏదైనా సమస్యలు ఉంటే ఇక్కడి ఉత్పత్తులు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. వ్యాపార అజెండాతో సాగుతున్న అమెరికా యంత్రాంగానికి మద్దతిస్తున్న కొన్ని దేశాలు ఇతరులపై నిందలు వేసే ప్రయత్నాలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడిలా విదేశాంగ విధానాన్ని ఇంత బహిరంగంగా నిర్వహించిన ఏ అధ్యక్షుడిని గతంలో చూడలేదన్నారు. వాణిజ్య అంశాలతో పాటు- వాణిజ్యేతర వ్యవహారాలకు

-మిగతా 2 లో

## 5 లక్షలతో పేదల ఇంటి నిర్మాణం అసాధ్యం

### కనీసం 12 లక్షలకు పథకం పెంచాలి



- మంత్రి పొంగులేటితో ఈటెల రాజేందర్ భేటీ
- మల్కాజిగిరి సమస్యలపై చర్చ

హైదరాబాద్, ఆగస్టు23(నీలగిరి ఎక్స్ ప్రెస్)
బిజెపి ఎంపిలు అయినప్పటికీ.. రాష్ట్ర అభివృద్ధి కోసం అవసరమైన అనుమతులు, నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నామని మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్‌అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు విషయంలో ఆయన శనివారం సచివాలయంలో గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణకు కేంద్రం నుంచి ఎక్కువగా నిధులు రావాలని తాము కోరుకుంటామన అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తమను సంప్రదించలేదని పేర్కొన్నారు. తమ దృష్టికి వచ్చిన

-మిగతా 2 లో

## సిరిసిల్ల కార్మికులను ఆదుకోండి

- రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలు మాఫీ చేయండి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కేటీఆర్ లేఖ



హైదరాబాద్,ఆగస్టు23(నీలగిరి ఎక్స్ ప్రెస్)
సిరిసిల్లలోని పవర్ లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. పవర్ లూమ్ కార్మికులపై పడుతున్న రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలను మాఫీ చేసి, వారికి రావాల్సిన రూ.101.77 కోట్ల విద్యుత్

-మిగతా 2 లో

# ఓట్ చోరీపై రాష్ట్రంలోను నిరసనలు

(మొదటి తరువాయి)

పిలుపునిచ్చారు. రాహులం చేస్తున్న ఆందోళనకు మద్దతుగా రాష్ట్రంలోనూ ఆందోళనలునిర్వహించాలని నిర్ణయించారు. ఇకపోతే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించిన నేతలు.. పార్టీపరంగా బీసీలకు 42 శాతం టికెట్లు- ఇవ్వాలని నిర్ణయించారు. శనివారం సాయంత్రం గాంధీభవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ- సమావేశంలో పలు అంశాలపై నేతలు చర్చించారు. రాష్ట్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న కమిటీల నిర్మాణంపై చర్చించారు. ఏఐసీసీ పిలుపు మేరకు ఓట్ చోరీ, గద్దీ ఛోడ్ ఉద్యమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. యూరియా కొరతపై భారత రాష్ట్ర సమితి, భాజపా చేస్తున్న రాజకీయాలు కూడా నేతల మధ్య చర్చకు వచ్చినట్టు- సమాచారం. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా కేసీఆర్ చట్టం తెచ్చారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ అడ్డంకిని తొలగించడానికి ఆర్డినెన్స్ తెచ్చామని పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ తెచ్చిన చట్టాన్ని సవరించడానికి ఆర్డినెన్సు తెచ్చామని.. దాన్ని గవర్నర్ కేంద్రానికి పంపారని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లో బీసీలకు మేలు జరగాల్సిందేనని సీఎం అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట నిలబడాలన్న సీఎం రేవంత్.. కేసీఆర్ తెచ్చిన చట్టం ప్రకారం బీసీలకు ఒక్క శాతం రిజర్వేషన్ కూడా రాదన్నారు. 90 రోజులలో రాష్ట్రపతి బిల్లులను ఆమోదించాలన్న అంశంపైన సుప్రీం కోర్టులో మన రాష్ట్ర వాదనలు వినిపించడం కోసం ఇద్దరు న్యాయవాదులను నియమించామని సీఎం చెప్పారు. అందులోనే రాష్ట్రపతి దగ్గర ఉన్న మన బీసీ బిల్లు అంశం ప్రస్తావనకు వస్తుందని చెప్పారు. విడిగా సుప్రీం కోర్టుకు వెళ్తే కేసు లిస్ట్ కావడానికి చాల సమయం పడుతుందని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్, బీజేపీ కలిసి యూరియా కొరత పైన డ్రామాలు ఆడుతున్నాయని సీఎం విమర్శించారు. యూరియా ఇచ్చే పార్టీకే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తానని కేటిఆర్ అనడంలోనే వాళ్ల తీరు అర్థం అవుతుందని సీఎం ఎద్దేవా చేశారు. యూరియా కోసం నాలుగు సార్లు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అనుప్రియా పటేల్ ను కలిశానని.. యూరియా పంపిణీ పైన క్షేత్రస్థాయిలో మానిటరింగ్ ను పెంచాలని సీఎం అన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీ-పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి

వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నేతలు వీహెచ్, జానారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఓట్ చోర్ ఆందోళన మూర్ఖత్వం

(మొదటి తరువాయి)



అయితే తెలంగాణ, కర్నాటకల్లో ఎలా విజయం సాధించారని అన్నారు. బిహార్‌లో ఇల్లీగల్ ఓట్లు- ఎక్కువ ఉన్నాయి. హైదరాబాద్‌లో డబుల్ ఓట్లు ఉన్నాయి.. ఇది దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచింది.. దొంగ ఓట్లతోనా? తీవ్రమైన నేరాల్లో ఉన్న సీఎం, మంత్రులు, కేంద్ర మంత్రులు రాజీనామా చేయాల్సిందే. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరగాల్సిందే. గతంలో దీనిపై కాంగ్రెస్ లేఖ రాసింది.. ఇప్పుడు మౌనంగా ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాడుతున్న భాష పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనను సైంధవుడు అని అన్నారని ఆయన తెలిపారు. కళ్ళు పీకి

గోలీలు ఆడుకుంటానని, తొండలు పెడతామని, పేగులు తీసి మెడలో వేసుకుంటానని, హవులగా.. ఇలా రకరకాలుగా పరస్పర విమర్శలు చేయడం భావ్యం కాదన్నారు. తాను ఆర్ఎస్ఎస్ స్క్రిప్ట్ చదువుతున్నానని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించడాన్ని ఆయన ప్రస్తావిస్తూ తాను ఆర్ఎస్ఎస్ కాబట్టి చదువుతానని అన్నారు. ఇది తెలంగాణ భాష కాదన్నారు. రాజకీయాల్లో శత్రువులు ఉండరాదని, ప్రత్యర్థులు మాత్రమే ఉండాలని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## మంచి చేస్తుంటే అడ్డుపడడం సహజం

(మొదటి తరువాయి)

బంజారాహిల్స్ లోని పార్క్ హయాత్ హోటల్ లో 'పాలసీస్ అండ్ స్ట్రాటజీస్ టూవారడ్స్ బయోఫిలిక్ అర్బనిజం' అనే అంశంపై ఏర్పాటు- చేసిన సౌత్ జోన్ కాన్ఫరెన్స్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాల అభివృద్ధికి సరైన ప్రణాళికే పునాది అని అన్నారు. పర్యావరణం, సుస్థిరత లేకుండా ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదన్నారు. భవనాలను నిర్మించడమే అభివృద్ధి కాదని, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణతో కూడిన వృద్ధి ఆవశ్యకమన్నారు. ఆర్థిక భవిష్యత్తుకు పట్టణ ప్రణాళికే పునాది అని నొక్కి చెప్పారు. మనం రూపొందించే ప్రతి విధానం, కాపాడే ప్రతి అడవి, పునరుద్ధరించే ప్రతి నది, సృష్టించే ప్రతి జీవనోపాధి - ఇవన్నీ తరాల మధ్య న్యాయానికి సంకేతాలని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి, కార్బన్ - న్యూట్రల్ గ్రోత్, జల సంరక్షణ, సుస్థిర రవాణాలో తెలంగాణ అవలంభిస్తున్న విధానాలు, తీసుకున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే సుస్థిరాభివృద్ధితో కూడిన నగరాలను అభివృద్ధి చేయొచ్చన్నారు. వాతావరణ మార్పులు, పట్టణ వరదలు, పర్యావరణ కాలుష్యం, భూగర్భ జలాల తరుగుదల, పట్టణీకరణ, తరిగిపోతున్న పచ్చదనం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నగర ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ-పీఐ ప్రెసిడెంట్ ఎన్ కే పటేల్, సెక్రటరీ జనరల్ కుల్ శ్రేష్ఠ, కో-ఆర్డినేటర్(-టె-క్నో అడ్మిన్) ప్రదీప్ కుమార్, ఐటీ-పీఐ - తెలంగాణ రీజినల్ ఛాప్టర్ ఛైర్మన్ ఎస్.దేవేందర్ రెడ్డి, కార్యదర్శి కె.మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 5 లక్షలతో పేదల ఇంటి నిర్మాణం అసాధ్యం

(మొదటి తరువాయి)

కొందరు పేదల జాబితాను మంత్రికి అందించామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పథకం కింద ఇంటి నిర్మాణం రూ.5 లక్షలతో పూర్తి కావడం లేదని, కనీసం రూ.12 లక్షలు ఇవ్వాలని కోరారు. నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో వాటిలో దొంగలు పడుతున్నారని అన్నారు. జవహర్‌నగర్‌లో మాజీ సైనికోద్యోగులకు సంబంధించిన భూముల్లో 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లను కూల్చడం సరికాదని

ఈ-టె-ల స్పష్టం చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు, సమస్యలను పరిష్కరించడానికి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తాజాగా రాష్ట్ర మంత్రితో భేటీ- అయ్యారు. ఈ సందర్భంగా సెక్రటేరియట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన ఆయన సమస్యలపై వివరణాత్మక చర్చ నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ పరిధిలో పేదలకు కేటాయించాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో సమస్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. గతంలో తప్పిపోయిన పేదల జాబితాను మంత్రి పొంగులేటికి అందించినప్పటికీ, ఇప్పటివరకు కేటాయింపులు సక్రమంగా జరిగేవి లేవని, అలాటెమంట్ పక్రియ పూర్తి కాకపోవడంతో భూములు దొంగల పుటకు చేరుతున్నాయని చెప్పారు.

అలాగే, ఐదు లక్షల రూపాయలతో పేదవాడు ఇల్లు కట్టే పరిస్థితి కుదరదని, నిజానికి కనీసం 12 లక్షలుగా ఖర్చు ఉంటు-ందని ఈటల రాజేందర్ వివరించారు. జవహర్ నగర్‌లో ఉన్న భూములు ప్రభుత్వానికి సంబంధం లేకుండా, మాజీ డిఫెన్స్ అధికారులకు కేటాయించబడినందుకు విమర్శలు వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా ఉన్న ఇండ్లను కూల్చడం కరెక్ట్ కాదని, 60-80 గజాల భూముల్లో ఇళ్ళు నిర్మించినవారు కటిక పేదలే కాక ధనవంతులైనవారే కాదని అన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబును కలిసే అవకాశం లేకపోవడంతో ఉఈ సమావేశం ఏర్పాటు- చేయలేకపోవడంపై బాధ వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నేరుగా సహకరించకపోవడం, అవసరమైతే కేంద్రంతో చర్చలు చేస్తామనే వైపు ఆయన వెల్లడించారు. కేంద్రం , రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వ్యవహారాల్లో నియమాలు, బాధ్యతలపై కూడా ఈటల రాజేందర్ స్పష్టత ఇచ్చారు. రాష్ట్ర మంత్రులు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గూర్చి, కేంద్రంపై మాత్రమే ఒత్తిడి చూపడం సరైనదా కాదని పేర్కొన్నారు. అంతేకాక, ఈటల రాజేందర్ ఉప రాష్ట్రపతి అభ్యర్థి కోసం పార్టీలు ఓట్ల కోసం అభ్యర్థన చేయాలని సూచించారు. ఈ భేటీ-, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని పేదల ఇళ్ల సమస్యను పరిష్కరించడానికి కేంద్రం , రాష్ట్ర ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకునే దిశగా ముందడుగు కాగలదనే దృక్పథాన్ని ప్రసారం చేస్తుంది.

## మీకు సమస్య ఉంటే మా ఉత్పత్తులు కొనకండి

(మొదటి తరువాయి)

టారిఫ్‌లు వినియోగిస్తుండటం కొత్తగా ఉందని ఉన్నారు. ఒక్క భారత్‌తోనే కాకుండా ప్రపంచంలోని చాలా దేశాలతో ఆయన డీల్ చేస్తున్న విధానం ఇలాగే ఉందన్నారు. వాణిజ్య సుంకాలను 50 శాతానికి పెంచుతున్నట్టు- ట్రంప్ ప్రకటించడానికి ముందు రష్యా చమురు అంశం గురించి అమెరికాతో తామెలాంటి చర్చలు జరపలేదని ఎనకానిక్ - టైమ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన వరల్డ్ లీడర్స్ ఫోరం సదస్సులో జైశంకర్ తెలిపారు. భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. భారత్‌తో ఘర్షణపూరిత వాతావరణాన్ని కొనసాగిస్తున్న వేళ.. పాకిస్థాన్-అమెరికా మధ్య స్నేహం ఇటీవల పెరుగుతున్నట్లు- కనిపిస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ రెండు దేశాల సంబంధాలపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ రెండు దేశాలకూ ఓ చరిత్ర ఉందని, గతాన్ని విస్మరించిన చరిత్ర కూడా వారిదేనన్నారు. ఈ సందర్భంగా ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చిన ఘటనను ఉటంకిస్తూ.. అమెరికా సైన్యం అబోటాబాద్‌లో జరిపిన ఆపరేషన్‌ను గుర్తుచేశారు. ఆ రెండు దేశాలకు పరస్పర చరిత్ర ఉంది. అంతేకాదు.. గతాన్ని విస్మరించిన చరిత్ర కూడా వారిదే. ఇటువంటివి మనం చూడటం కొత్తమీ కాదు. ఇదే అమెరికా సైన్యం అబోటాబాద్ వెళ్లి ఎవర్ని గుర్తించిందో మనందరికీ తెలుసు' అని జైశంకర్ పేర్కొన్నారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై సెప్టెంబర్ 11నాటి దాడికి సూత్రధారి బిన్ లాడెన్‌ను అమెరికా మట్టుపెట్టిన విషయాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. పలు దేశాల సైన్యాలు ఏవిధంగా పని చేస్తున్నాయనే విషయంపై జై శంకర్ మాట్లాడుతూ.. కొన్ని దేశాలు అవకాశవాద రాజకీయాలపై దృష్టి పెట్టినప్పుడు.. అవి అలా చేస్తూనే ఉంటాయి. అందులో కొన్ని వ్యూహాత్మకంగా లేదా ఇతర ప్రయోజనాల కోసం ఉండవచ్చని అన్నారు. ఇలాంటివి చూస్తున్నప్పుడు అమెరికాతో మనకు ఉన్న బలమైన సంబంధాలు ఏంటీ- ఏవి ముఖ్యమైనవనే అంశాలపైనా భారత్ దృష్టి సారిస్తుందన్నారు. మరోవైపు అమెరికా కోసమే తాము ఉగ్రవాదులను పెంచి పోషించామంటూ పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల అంగీకరించిన విషయం తెలిసిందే. పహల్గాం దాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. పశ్చిమదేశాల కోసమే మూడు దశాబ్దాల పాటు- తాము చెత్త పనులన్నీ చేస్తున్నామని అన్నారు. దానివల్ల చాలా ఇబ్బందులు పడ్డామని, చివరకు అది పొరబాటు- అని అర్థమైందన్నారు.

## రోదసి అన్వేషణకు సిద్ధం కండి

(మొదటి తరువాయి)

ఉంటాయన్నారు.అంతరిక్ష రంగంలో భారత్ ఒక్కొక్క మైలురాయి అందుకుంటోందని, ఇది దేశానికి గర్వకారణమన్నారు. నేషనల్ స్పేస్ డే సందర్భంగా.. అంతరిక్ష రంగంతో సంబంధం ఉన్న శాస్త్రవేత్తలు, యువతకు ఆయన విషెస్ తెలిపారు. సెమీ క్రయోజనిక్ ఇంజిన్లు, ఎలక్ట్రానిక్ ప్రొపల్షన్ లాంటి టెక్నాలజీ సంబంధిత అంశాల్లో భారత్ అత్యాధునికంగా దూసుకెళ్తోందన్నారు. భారత్ త్వరలో గగన్‌యాన్ మిషన్‌ను లాంచ్ చేస్తుందని, రాబోయే రోజుల్లో స్వంత అంతరిక్ష కేంద్రాన్ని ఇండియా నిర్మిస్తుందని ప్రధాని చెప్పారు. భారత పరిపాలనా వ్యవస్థలో స్పేస్ టెక్నాలజీ అధిక భాగంగా మారిందన్నారు. పంట బీమా పథకాలు, మత్స్యకారుల రక్షణ, విపత్తు సహాయక చర్యలన్నీ ఇప్పుడు శాటిలైట్ ఆధారితంగా జరుగుతున్నట్లు ఆయన వెల్లడించా. అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతి.. దేశ సాధారణ ప్రజల జీవితాలను మరింత సులభతరం చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.

## ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ ఫ్రీ

(మొదటి తరువాయి)

దీంతో కాలుష్య నియంత్రణకు మహా సర్కార్ చర్యలు చేపట్టింది. కాలుష్య రహిత వాహనాలను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగానే ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ నుంచి మినహాయింపు ఇచ్చింది. ఈ విధానం వల్ల అధికశాతం మంది ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతారని, తద్వారా కాలుష్యం నుంచి బయటపడొచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## హైడ్రా రాకతో తగ్గిన ఆక్రమణలు

(మొదటి తరువాయి)

సమీక్షించుకుంటాం అన్నారు. హైడ్రా ఏర్పాటు- తర్వాత ప్రభుత్వమే జిహెచ్ఎంసి యాక్ట్‌లో మార్పులు చేసి సంబంధిత అధికారాలు కల్పించిందని కమిషనర్ తెలిపారు. ముఖ్యమంత్రి, ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ సహకరిస్తున్నారని చెప్పారు. వరదల్లో మురుగు నీరు సమస్యలను పరిష్కరించడం, అకాల వర్షాల సమయంలో ముందస్తు చర్యలు చేపట్టడం, పర్యావరణ పరిరక్షణ, చెరువులు-నాలాలను రక్షించడం హైడ్రా ప్రధాన లక్ష్యమని కమిషనర్ చెప్పారు. నాలాల్లో వేలాది ట్రక్కుల పూడికతీత పనులు చేశాం. సిబ్బంది చేతనే మ్యాన్‌హోల్స్, నాలాలు క్లీన్ చేయించాం. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో కొన్ని ఫోర్కాస్ట్ ఇబ్బందులు ఉన్నా, ఇప్పుడే చేస్తున్న పనులు వచ్చే 100 ఏళ్లకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 65 శాతం చెరువులు మాయం అయ్యాయి. పొల్యూషన్ వల్ల అనేక సమస్యలు వచ్చాయి. వాటిని అడ్డుకోవాలి. ఈ÷ూ పేరుతో చెరువులు కొట్టేయాలని చూస్తే ఊరుకోం. చెరువుల మాదిరిగా నాలాలను కూడా నోటిపై చేసి కబ్జాలను నిరోధిస్తాం అని హెచ్చరించారు.

అలాగే, బతుకమ్మ కుంట, కూకట్పల్లి చెరువుల అభివృద్ధి పనులు చేపట్టిన తర్వాత స్థానికులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. హైడ్రా ఏర్పడి సంవత్సరం పూర్తయిందని, ఈ కాలంలో అనేక కార్యక్రమాలు అమలు చేశామని కమిషనర్ తెలిపారు. తక్కువ మ్యాన్‌పవర్‌తో ఎక్కువ ప్రొడక్టివిటీ- సాధించాం. ఇప్పటి వరకు 500 ఎకరాలను కాపాడగలిగామని గర్వంగా చెప్పారు.

## అమెరికాకు పోస్టల్ సేవలు బంద్

(మొదటి తరువాయి)

వెల్లడించింది.కాగా, అమెరికా విధించిన టారిఫ్ డ్యూటీ కలెక్షన్ ప్రక్రియపై ఇంకా స్పష్టత రాలేదు. దీంతో ఆగస్ట్ 25 తర్వాత అమెరికాకు పోస్టల్ పార్శిల్స్‌ను తీసుకెళ్లబోమని పలు విమానయాన సంస్థలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో దీనికి అనుగుణంగా ఆగస్ట్ 25 నుంచి వంద డాలర్లు వరకు విలువైన లేఖలు, పత్రాలు, బహుమతి వస్తువులు మినహా మిగతా అన్ని రకాల వస్తువుల బుకింగ్స్‌ను నిలిపివేస్తున్నట్లు పోస్టల్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. మరోవైపు ఇప్పటికే పార్శిల్‌లను బుక్ చేసుకున్న, పంపలేని కస్టమర్లు రీఫండ్ క్లెయిమ్ చేసుకోవచ్చని పోస్టల్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. 'కస్టమర్లకు కలిగిన అసౌకర్యానికి తపాలా శాఖ తీవ్రంగా చింతిస్తోంది, వీలైనంత త్వరగా అమెరికాకు పూర్తి సేవలను తిరిగి ప్రారంభించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం' అని అధికారిక ప్రకటనలో పేర్కొంది.

## సిరిసిల్ల కార్మికులను ఆదుకోండి

(మొదటి తరువాయి)

సబ్సిడీని వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు లేఖ రాశారు. సిరిసిల్ల ప్రాంతం పవర్ లూమ్ పరిశ్రమకు ప్రసిద్ధి చెందిందని, ఇక్కడ సుమారు 25 వేల పవర్ లూమ్‌లు నడుస్తున్నాయని లేఖలో కేటీ-ఆర్ వివరించారు. మారిన మార్కెట్ పరిస్థితులతో బతకలేక ఆత్మహత్యలే శరణ్యం అనుకున్న సిరిసిల్ల నేతన్నల తలరాత మార్చేందుకు తమ హయాంలో బతుకమ్మ చీరల పథకం తీసుకొచ్చామన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్ తో సిరిసిల్ల నేతన్నలకు చేతినిండా పని దొరకడంతో పాటు స్థిరమైన ఆదాయం లభించిందని తెలిపారు. అయితే ప్రస్తుతం పవర్ లూమ్ యూనిట్లు- ఎదుర్కొంటున్న సమస్యలు కార్మికులను తిరిగి ఆత్మహత్యల వైపు నెడుతున్నాయని కేటీ-ఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కుటీర పరిశ్రమల కేటగిరీ కింద 50 శాతం విద్యుత్ టారిఫ్ సబ్సిడీ పొందుతున్న యూనిట్లు-, అవగాహన లోపంతో ఎస్ఎస్ఐ యూనిట్లుగా మారడంతో ఇండస్ట్రీ-÷-ర3 కేటగిరీ కిందకు వచ్చాయని కేటీఆర్ వివరించారు. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాల మేరకు 127 ఎస్ఎస్ఐ యూనిట్లకు, అలాగే 191 ఇతర యూనిట్లకు మొత్తం రూ.35.48 కోట్లు- బ్యాక్ బిల్లింగ్ బకాయిలు పడ్డాయని తెలిపారు. ఈ భారీ మొత్తాన్ని చెల్లించే స్థితిలో కార్మికులు లేరని, ఫలితంగా వారికి పవర్ లూమ్స్ నడపడం కష్టంగా మారిందన్నారు. పవర్ లూమ్స్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.101.77 కోట్ల సబ్సిడీ విడుదల కాకపోవడంతో, సిరిసిల్ల కో-ఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లయ్ సొసైటీ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని కేటీఆర్ తెలిపారు. టీ-జీఎన్‌పీడీసీఎల్‌కు చెల్లించాల్సిన విద్యుత్ కొనుగోలు ఖర్చులను కూడా చెల్లించలేకపోతున్నదని వివరించారు. నేత కార్మికులను ఆదుకోవడానికి, వారి జీవనోపాధిని కాపాడటానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని కేటీ-ఆర్ కోరారు. బకాయిలను మాఫీ చేసి, సబ్సిడీలను విడుదల చేసి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## 2025 ఆగస్టు 24, ఆదివారం తెలుగు పంచాంగం




మాసం - పక్షం
భాద్రపద మాసం
శుక్లపక్షం
తిథి
శుక్ల ప్రతిపద: ఆగస్టు 23 ఉద. 06:36 - ఆగస్టు 24 ఉద. 04:45 వరకు
శుక్ల ద్వితీయ: ఆగస్టు 24 ఉద. 04:45 - ఆగస్టు 25 ఉద. 02:54 వరకు
నక్షత్రం
మఖ: ఆగస్టు 23 రా. 12:08 - ఆగస్టు 24 రా. 11:28 వరకు
పుబ్బ: ఆగస్టు 24 రా. 11:28 - ఆగస్టు 25 రా. 10:20 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:27- 5:13
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:55 - 12:46
అమృతకాలం: మధ్యాహ్నం 1:21 - 2:52
అశుభ సమయాలు
రాహుకాలం: సాయంత్రం 5:57 - 7:28
యమగండం: మధ్యాహ్నం 12:16 - 1:47
గులిక కాలం: ఉదయం 3:01 - 4:32
దుర్ముహూర్తం: సా. 4:39 - 5:31 & రా. 9:04 - 9:48
వర్జ్యం: మధ్యాహ్నం 1:21 - 2:52

# ఆమనగల్లు జూనియర్ కళాశాల భవనంపై విద్యార్థి సంఘాల ఆందోళన




**ఆమనగల్లు, ఆగస్టు23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థాపితమైన 2001 సంవత్సరం నుండి ఇప్పటివరకు స్వంత భవనం లేకపోవడం విద్యార్థుల విద్యా ప్రయాణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. మౌలిక సదుపాయాల లేకపోవడంతో విద్యార్థులు అరుబయట, ఇరుకైన గదుల్లో చదువుకోవాల్సిన దుస్థితి ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో రెండు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ. వెంకటేష్ మాట్లాడుతూ, “హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఆమనగల్లు కళాశాల 24 సంవత్సరాలుగా భవనం లేకుండానే కొనసాగుతోంది. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం” అని ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణ రెడ్డి గారికి పలు వినతులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు స్పందించకపోవడం పట్ల విద్యార్థి సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. “ప్రభుత్వం స్పందించకపోతే రాస్తారోకో, ఛలో కలెక్టరేట్ వంటి ఉద్యమాలు చేపడతాం” అని హెచ్చరించారు. ఈ దీక్షలకు ఎంఆర్‌పీఎస్, పీఎన్ఎం, సీఐటీయూ, రైతు సంఘం, జర్నలిస్టుల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రణయ్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి. శివ శంకర్, ఆమనగల్లు డివిజన్ ఎస్ఎఫ్ఐ నాయకులు కురిమిద్ద శివ, వినోద్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు

– బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.



**దేవరకొండ,ఆగష్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సురవరం సుధాకర్ రెడ్డి మరణం తెలంగాణ రాజకీయాలకు, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.సురవరం సుధాకర్ రెడ్డి తన జీవితాన్ని ప్రజల కోసం, పేదల అభ్యున్నతి కోసం అంకితం చేశారు.నల్లగొండ పార్లమెంట్ సభ్యుడిగా ఆయన అందించిన సేవలు అపారమైనవి అని ఆయన గుర్తు చేశారు.2004 నుంచి 2009 వరకు శాసనసభ్యులు గా తను కలిసి పని చేయడం జరిగింది అని,సహచరుడిగా పనిచేసిన జ్ఞాపకాలను ఇంకా మదిలోనే ఉన్నాయని ఆయన తెలిపారు.విలువలతో కూడిన రాజకీయాలకు ఆయన నిలువుటద్దం. ఆయన పోరాట స్ఫూర్తి, నిబద్ధత అందరికీ స్ఫూర్తిదాయకం అని ఆయన అన్నారు.ఆయన కుటుంబానికి, మిత్రులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను అని ఆయన తెలిపారు.సురవరం సుధాకర్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవ శాంతి సమావేశం

మిర్యాలగూడ పోలీస్ వారి ఆధ్వర్యంలో .



**మిర్యాలగూడ,ఆగష్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మిర్యాలగూడ పట్టణంలో శనివారం నాడు గణేష్ నవరాత్రి ఉత్సవ శాంతి సంఘ సమావేశం పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించారు ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలందరు ఆహ్లాద వాతావరణంలో భక్తి శ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు... అలాగే రాత్రి వేళల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు .అన్ని కులాలు, మతాలు కలిసి మెలసి ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ , డీఎస్పీ రాజశేఖర్ రాజు , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ శాంతి సమావేశంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్





**మిర్యాలగూడ, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మిర్యాలగూడ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి శాంతి సంఘ సమావేశంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ప్రజలంతా భక్తి శ్రద్ధలతో, ఆహ్లాద వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని ఆయన సూచించారు. రాత్రి వేళల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అన్ని కులాలు, మతాలు కలిసి మెలసి ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ రాజశేఖర్ రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలపై కమిషనర్‌కు బీజేపీ వినతిపత్రం



**మిర్యాలగూడ, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మిర్యాలగూడ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న మౌలిక సదుపాయాలపై టూ టౌన్ బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ని కలిగి వినతిపత్రం సమర్పించారు. హనుమాన్ పేట ఫ్లైఓవర్ నుంచి రైల్వే ట్రాక్ వరకు రాత్రివేళ వీధి దీపాలు వెలగకపోవడం, రవీంద్ర నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం వంటి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.నందిపాడు రోడ్డుటాకా నుంచి బైపాస్ ఎక్స్‌రోడ్ వరకు అండర్గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతున్నా, రోడ్డు డైవర్షన్ బోర్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫాగింగ్, బ్లీచింగ్ సరిగా నిర్వహించకపోవడం వల్ల దోమల వ్యాప్తి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పెద్ద బోయిన వీటి యాదవ్, నందికొండ హరిప్రసాద్, నిరంజన్ రెడ్డి, కనపర్తి రాంప్రసాద్, చిలుకూరు శ్యాము, రేపాల పురుషోత్త రెడ్డి, సాధినేని శ్రీనివాస్ రావు, తదితర జిల్లా, రాష్ట్ర, పట్టణ బీజేపీ నాయకులు పాల్గొన్నారు. మౌలిక సదుపాయాల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన అనగాని శివప్రసాద్

**నిజాంపట్నం.ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో నిజాంపట్నం మండలం, బావాజీపాలెం అదవల గ్రామానికి చెందిన బడుగు శివాజీ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం సహాయ నిధినుండి మంజూరైన 61 వేల 200 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బడుగు శివాజీ కుటుంబ సభ్యులకు అందచేసిన అనగాని శివప్రసాద్.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్యూఐ జేఎన్టీయూ అధ్యక్షుడిగా ఎన్నికైన సన్నీకి అభినందనలు



**కూకట్పల్లి, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంకు కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్యూఐ యూనివర్సిటీ అధ్యక్షుడిగా సన్నీ ఇమన్యుయేల్ నూతనంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ని మూసాపేట్‌లోని హేమ దుర్గా భవాని కాంగ్రెస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సన్నీతో పాటు వచ్చిన బృందాన్ని బండి రమేష్, గొట్టుముక్కల వెంకటేశ్వర రావు శాలువాలతో సత్కరించి, హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. ఎన్ఎస్యూఐ నాయకత్వంలో విద్యార్థి సమస్యలపై చురుకైన పోరాటం కొనసాగించాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ–హెచ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బాలానగర్ సందీప్, వర్కింగ్ ప్రెసిడెంట్ దాస్యం విక్రాంత్, శ్రీకాంత్, రాంచరణ్, ఉదయ్ తివారి, శశి ప్రీతం, సలీం, భార్గవ్, అభిషేక్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై స్పందించిన శ్రీశైలం గౌడ్



**షాపూర్ నగర్, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** షాపూర్ నగర్‌లో తన నివాసంలో ప్రజలతో ముఖాముఖి సమావేశమైన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందించిన ఆయన, “రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉంది. ప్రజాపాలన ముందుకు సాగుతోంది” అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సురవరం సుధాకర్ రెడ్డికి మిర్యాలగూడ సిపిఐ ఘన నివాళి



**మిర్యాలగూడ, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి అకాల మృతికి మిర్యాలగూడ సిపిఐ కార్యకర్తలు ఘనంగా నివాళు లర్పించారు. నల్గొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పోలేపల్లి ఉదయ్ కుమార్, యాదగిరి ధీరావత్, లింగ నాయక్, ధనావత్ శాంత, కోటేశ్వరి షిమి తదితరులు పాల్గొన్నారు. సిపిఐ పార్టీకి తీరని లోటుగా సురవరం మృతి నిలిచిందని కార్యకర్తలు భావించారు.

# రక్తదానం గొప్ప సేవ

## ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి







**షాద్‌నగర్, ఆగస్టు23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాద్‌నగర్ విజయనగర్ కాలనీలో బ్రహ్మకుమారిస్ సమాజ సేవ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి పాల్గొన్నారు. "రక్తం అనేది ప్రాణాధారం, రక్తదానం కంటే గొప్ప దానం మరొకటి లేదు" అంటూ ఆయన రక్తదాన ప్రాముఖ్యతను వివరించారు. విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరానికి హాజరైన ఎమ్మెల్సీ, సేవా కార్యక్రమం చేపట్టిన శోభ బాహింజి, లక్ష్మీ బాహింజి లను అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ కష్టాలు లేకుండా చర్యలు

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**కొందుర్గు, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, విద్యుత్ గోడౌన్‌ను పరిశీలించారు. "నియోజకవర్గవ్యాప్తంగా ఎక్కడా కరెంట్ సమస్యలు తలెత్తకూడదు. అవసరమైన సామాగ్రి పూర్తిగా అందుబాటులో ఉండాలి" అని ఆయన స్పష్టం చేశారు. మండల పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, డీఈ శ్యాంసుందర్ రెడ్డి, ఏఈ రవికుమార్, కాంట్రాక్టర్ మధుసూదన్ రెడ్డి తదితరులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. దరఖాస్తులు వచ్చిన 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేందుకు ప్రభుత్వం ఖర్చుకు వెనుకాడదని, అవసరమైన సామాగ్రి సమకూర్చే బాధ్యత తనదేనని ఆయన పేర్కొన్నారు.

# సమాచార హక్కు చట్టం అమలులో లోపాలు

## - కమిషన్ సభ్యులకు వినతి



**వనపర్తి,ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజల ఫిర్యాదులు స్వీకరించేందుకు విచ్చేయగా, వనపర్తి జిల్లా సమాచార హక్కు చట్ట దరఖాస్తుదారులు వినతి పత్రాలు సమర్పించారు. పీవీ నరసింహారావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, వైష్ణవిల సమక్షంలో గజరాజుల తిరుమలేష్, హెూవదేకర్ అభిలాష్ తదితరులు డి ఎం హెచ్ ఓ , డీఈవో ,ఎం ఆర్ వనపర్తి మున్సిపాలిటీ కార్యాలయాలు వంటి విభాగాల్లో అసంపూర్ణ సమాచారం, ఆలస్యం, బాధ్యతా రాహిత్యం జరుగుతున్నాయని వివరించారు.దరఖాస్తు ఇచ్చిన 30 రోజులు పూర్తైనా సరైన సమాచారం ఇవ్వకపోవడం, "మా పరిధిలో లేదు" అంటూ అధికారులు తప్పించుకోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.సమాచార హక్కు చట్టం కింద అన్ని కార్యాలయాల్లో పకడ్బందీగా చర్యలు తీసుకొని పూర్తి స్థాయి సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ సభ్యులను వినతి దారులు కోరారు.

# సురవరం సుధాకర్ రెడ్డికి సిపిఐ నివాళి



**వనపర్తి,ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి అంబేద్కర్ చౌక్‌లో సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ – "సురవరం ఆశయం, ఎర్రజెండా మరణించవు. ఆయన ప్రజల కోసం, సమసమాజం కోసం నిరంతరం పోరాడారు. పదవుల కోసం కాకుండా ప్రజా అభ్యున్నతే ఆయనకు ముఖ్యమైంది" అన్నారు. కార్యక్రమంలో కళావతమ్మ, జనజ్వాల, శ్రీనివాస్ గౌడ్, గోపాలకృష్ణ, కృష్ణవేణి, జయమ్మ, ఏఐవైఎఫ్ నాయకులు కుతుబు, మహేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల్లో డీజే వినియోగంపై కఠిన నిబంధనలు




**మాడుగుల, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వినాయక చవితి, దసరా నిమజ్జనాల సందర్భంగా అధిక శబ్దంతో డీజే సిస్టమ్స్ వినియోగం ప్రజల ఆరోగ్యానికి హానికరమని భావించిన మాడుగుల పోలీస్ అధికారులు, స్థానిక డీజే ఆపరేటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో 1 లక్ష పూచికత్తుతో బైండోవర్ చేయించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ పోలీస్ మాడుగుల స్పష్టం చేస్తూ, నిబంధనలు ఉల్లంఘించి అధిక శబ్దంతో డీజేలు వినియోగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల శాంతి, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు.

# మానకొండూరులో పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



**మానకొండూరు, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మానకొండూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 26న ఉదయం 11:30 గంటలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా సైకిళ్ల పంపిణీ జరగనుంది. ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కానుకగా, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో చేపట్టారు. మానకొండూరు ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి శనివారం స్థానిక బీజేపీ శ్రేణులతో కలిసి వేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "పేద కుటుంబాల విద్యార్థులకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, సైకిళ్ల పంపిణీ ద్వారా విద్యార్థులకు ఊరట కలిగించాలన్నదే లక్ష్యం" అని పేర్కొన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, మాడ వెంకట్ రెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు, గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, దండు కోమురన్న, కంది రాజిరెడ్డి తదితర బీజేపీ నేతలు పాల్గొననున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 20 వేల సైకిళ్లను దశలవారీగా పంపిణీ చేయనున్నట్లు సమాచారం.

# జైపాల్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఉప్పునుంతల, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిరుమలపూర్ గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయకులు జైపాల్ రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్వయంగా గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి గౌరవ నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే, "మీ కుటుంబానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అంటూ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, వెల్దండ మండల మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. విషాద సమయంలో ప్రజాప్రతినిధిగా చూపిన ఈ మానవీయ స్పందన స్థానికంగా ప్రశంసలు పొందుతోంది.

# శ్రీశైలం హైవేపై కదులుతున్న కారులో మంటలు



**వెల్దండ, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని కొట్ర చెక్‌పోస్ట్ సమీపంలో హైదరాబాద్ శ్రీశైలం హైవేపై కదులుతున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన ఘటన కలకలం రేపింది. కారులో ప్రయాణిస్తున్న సుధాకర్ అనే వ్యక్తి అతి కష్టం మీద బయటపడగా, క్షణాల వ్యవధిలోనే కారు పూర్తిగా దగ్ధమైంది. కల్వకుర్తికి వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్తున్న సమయంలో కొట్ర తండా సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కారు డోర్లు లాక్ కావడంతో సుధాకర్ కారులోనే చిక్కుకుపోయారు. స్థానికులు అప్రమత్తమై, అతన్ని సురక్షితంగా బయటకు తీసుకురావడం జరిగింది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, కల్వకుర్తి నుండి ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణహాని జరగకపోవడం ఊరట కలిగించింది.

# ఆదర్శ పాఠశాల లో వనమహోత్సవం




**దేవరకొండ,ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ జిల్లా డిండి మండలం స్థానిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల లో శనివారం నాడు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో పాఠశాల మైదానంలో 100 మంది 100 మొక్కలు నాటారు.ఈసందర్భంగా ఎన్. ఎస్.ఎస్.ప్రోగాం ఆఫీసర్ చింత బిచ్చయ్య మాట్లాడుతూ ప్రకృతి పర్యావరణం లో భాగంగా ప్రతి విద్యార్థి కూడా తన వంతు గా ఒక మొక్క ను నాటాలని సూచించారు.ప్రాణవాయువును అందించేది మొక్కలే అని అన్నారు.ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ చింత బిచ్చయ్య, శ్రీలత,రమా, సుశీల, కోదండ రామారావు, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, బాలకృష్ణ, రాజు, రమేష్, విజయ్ ,శ్రీను శ్రీలత, జ్యోతి, రుంషా, ధనలక్ష్మి, సందీప్, పిడి రవి, ఎన్. ఎస్. ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు కోరుతూ టీపీయూఎస్ వినతిపత్రం



**మంచాల, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్**
: టీపీయూఎస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలని కోరుతూ మంచాల మండలం, రంగారెడ్డి జిల్లా తహసీల్దార్ కార్యాలయానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్, మండల అధ్యక్షులు రావుల శివకుమార్, బాధ్యులు వెంకటేష్, దత్తాత్రేయ, రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది వినతిని స్వీకరించారు. సీపీఎస్ రద్దు వరకు రాజీలేని పోరాటం కొనసాగుతుందని టీపీయూఎస్ నేతలు స్పష్టం చేశారు.

# కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూమిపూజ



**షాద్‌నగర్, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొందూరు మండలంలో రూ.200 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూమిపూజ శనివారం జరిగింది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు వేద మంత్రాల సాక్షిగా పూజలు నిర్వహించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన 'యంగ్ ఇండియా' స్కూల్స్ పథకంలో భాగంగా ఈ స్కూల్ మంజూరైంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక స్కూల్ ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం, మొదటి విడతలో 19, రెండో విడతలో 26 స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నారు.

## చిల్కమర్రిలో శిథిలమవుతున్న గాంధీ విగ్రహం



**ఫరూఖ్‌నగర్, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలోని చిల్కమర్రి గ్రామంలో హనుమాన్ దేవాలయం ఎదుట ఉన్న గాంధీ విగ్రహం శిథిలావస్థకు చేరింది. విగ్రహానికి కుడిచేయి పూర్తిగా విరిగిపోవడం, చేతిలో ఉండాల్సిన కర్ర కనిపించకపోవడం స్థానికుల ఆవేదనకు కారణమవుతోంది. ఒకప్పుడు ప్రేమకు, శాంతికి ప్రతీకగా నిలిచిన ఈ విగ్రహం ఇప్పుడు విరిగిన రాయిలా కాదు, విరిగిన ఆశయాల ప్రతిరూపంగా మారింది. ప్రజాప్రతినిధులు పూలదండలు వేసేంత మాత్రాన గాంధీ సిద్ధాంతాలు నిలబడవు. విగ్రహానికి అవసరమైన ఆహార్యం కల్పించడంలో నిర్లక్ష్యం చూపడం బాధాకరం అని స్థానికులు వాపోతున్నారు.గాంధీ జయంతి సమీపిస్తున్న వేళ, చిల్కమర్రి ప్రజలు నూతన విగ్రహం ఏర్పాటు చేసి, గాంధీ స్ఫూర్తిని తిరిగి ప్రజల్లో నాటాలని కోరుతున్నారు. "హే రామ్" అనే ఆవేదనతో శిథిలమవుతున్న విగ్రహం మన బాధ్యతను మనకే గుర్తుచేస్తోంది.

# కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటు

**సీపీఐ డిండి మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా సురవరంకు నివాళులు.**



**దేవరకొండ,ఆగష్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సుప్రసిద్ధ కమ్యూనిస్టు యోధుడు,సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటేరియన్ సురవరం సుధాకరరెడ్డి మరణం వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.సిపిఐ డిండి మండల సమితి ఆధ్వర్యంలో సీపీఐ ప్రజాభవన్ కార్యాలయంలో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.సురవరం సుధాకర్ రెడ్డి ఆరోగ్యం క్షీణించడంతో హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు.సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు ముగిసిన కొద్ది నిమిషాలకే తమ ఆత్మీయ నేత సురవరం మరణించిన వార్త తెలియడంతో సిపిఐ నాయకులు,పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారన్నారు.సురవరం సుధాకర్‌రెడ్డి 1942,మార్చి 25న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాన్‌రేవ్‌పల్లిలో జన్మించారు. ఆయన తండ్రి వెంకట్‌రామ్‌రెడ్డి.తెలంగాణ వైతాళికుడు,గోల్కొండ పత్రిక సంపాదకులు సురవరం సుధాకర్ రెడ్డి ఎఐఎస్ఎఫ్,ఎఐవైఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా, అనంతర కాలంలో ఎస్ఎఫ్, వైఎఫ్ జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా ఢిల్లీలో ఉంటూ దేశవ్యాప్త విద్యార్థి, యువజన ఉద్యమాల వ్యాప్తికి విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన నేతృత్వంలో పనిచేసిన ఆనేక మంది విద్యార్థి, యువజన నాయకులు తరువాత కాలంలో వివిధ రాష్ట్రాల్లో రాజకీయ నాయకులుగా ఎదిగారన్నారు. సురవరం సుధాకరరెడ్డి చక్కని వాగ్ధాటి, విషయ స్పష్టత కలిగిన వక్త. ఒకతరం విద్యార్థి, యువజనులకు ఆయనో ఆకర్షణ.గుర్తింపు పొందిన పార్లమెంటేరియన్ గా కీర్తి గడించారన్నారు.సురవరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సీపీఐ పార్టీ తరపున తెలియజేస్తున్నామన్నారు. ఈ నివాళి కార్యక్రమంలో సిపిఐ తవక్లాపూర్ కార్యదర్శి వంకేశ్వరం చక్రి,సాగర్, ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్, ఏ ఐ వై ఎఫ్ మండల కార్యదర్శి మహేష్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సురుగి వినయ్,ఎడ్ల శ్రీను,జంగయ్య,జగన్,తదితరులు పాల్గొన్నారు.

## సురవరం సుధాకర్ రెడ్డికి కల్వకుర్తిలో సిపిఐ ఘన నివాళి



**కల్వకుర్తి, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యులు, సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతికి సిపిఐ నేతలు కల్వకుర్తి మహబూబ్‌నగర్ చౌరస్తాలో ఘనంగా నివాళులర్పించారు. శనివారం ఉదయం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, కౌకుంట్ల కేశవులు గౌడ్, రవీందర్, పులిజాల పరుశరాములు, దారదాసు మస్కా, బిక్షం, శేఖర్, మస్తాన్, రవి తదితరులు పాల్గొన్నారు. ప్రజా ఉద్యమాలకు జీవితాన్ని అంకితం చేసిన సుధాకర్ రెడ్డి మృతి సిపిఐ వర్గాలకు తీరని లోటుగా పేర్కొన్నారు.

## ఐనోలు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో సదుపాయాల పరిశీలన



**అచ్చంపేట, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని ఐనోలు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం, టాయిలెట్ల సదుపాయాలు, విద్య బోధన అంశాలపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన సదుపాయాలపై అధికారులు దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము బుచ్చి రాములు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం చేపట్టిన ఈ పరిశీలన స్థానికంగా ప్రశంసలు పొందుతోంది.

## సుధాకర్ రెడ్డి ఆశయాలు యువతకు మార్గదర్శకం

-గంగవరం రామకృష్ణారెడ్డి
-పదవుల కాకుండా ఆశయాల దిశగా సాగాలి
-సుధాకర్ రెడ్డి జీవితం యువతకు స్ఫూర్తి





**వనపర్తి,ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మహానేత సురవరం సుధాకర్ రెడ్డి సేవలను స్మరించుకుంటూ ఆయనకు ఘననివాళులర్పించిన వనపర్తి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి గంగవరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసం, ఆశయాల కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులలో సుధాకర్ రెడ్డి ఒకరని, అలాంటి నాయకుల జీవితం యువతకు స్ఫూర్తి కావాలని ఆయన పేర్కొన్నారు."రాజకీయాలను కేవలం పదవుల కోసం కాకుండా సమాజంలో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో చూడాలి. ఆశయాలే మనల్ని నిలబెడతాయి, పదవులు తాత్కాలికం. సుధాకర్ రెడ్డి జీవితం అందుకు అద్భుతమైన ఉదాహరణ" అని రామకృష్ణారెడ్డి తెలిపారు. అలాగే ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో, రైతు -కార్మికుల సమస్యల పరిష్కారంలో సుధాకర్ రెడ్డి చూపిన తపన విశేషమని ఆయన గుర్తు చేశారు. యువత ఆయన చూపిన ఆశయాలు తమ జీవన మార్గంగా చేసుకోవాలని రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.

## కౌలు రైతు ఆత్మహత్య

**కొల్లూరు.ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఇటీవల కృష్ణానది వరద ఉధృతి కారణంగా పొలాలు పూర్తిగా మునిగిపోయి పంటలు పాడైపోయి రైతు తీవ్ర నష్టం చెందారు.ఈ క్రమంలో పోతారు లంకకు చెందిన రైతు మురళీకృష్ణ బ్యాంకుల్లో రుణము అప్పు తీసుకొని పెట్టుబడులు పెట్టి పొలం సాగు చేస్తున్న తరుణంలో అకస్మాత్తుగా ఈ కృష్ణా జలాలు ఆ పొలాలను ముంచటం వల్ల రైతు మనస్థాపం చెంది అప్పుల పాలు అవటంవల్ల ఆత్మహత్యకు పాల్పడ్డారు. చికిత్స కోసం తెనాలి హాస్పిటల్ కి తరలించి వారం నుంచి చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతి చెందిన రైతును వేమూరి శాసనసభ్యుడు ఆనందబాబు తెనాలి ప్రభుత్వ హాస్పిటల్ లో మృత దేహానికి నివాళులు అర్పించి, కుటుంబాన్ని పరామర్శించిచటమైనది.కుటుంబానికిప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని దైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సురవరం సుధాకర్ రెడ్డి నిబద్ధతగల నాయకుడు

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



**నల్లగొండ ,ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు,లోక్‌సభ మాజీ సభ్యుడు,కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం పట్ల లినల్లగొండ శాసన సభ్యులు రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రాఫి శాఖల మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచి వామపక్ష భావజాలం కలిగిన సురవరం చివరి వరకు నమ్మిన సిద్ధాంతం కోసం అవిశ్రాంత పోరాటం చేశారని గుర్తుచేసుకున్నారు.. విద్యార్థి దశ నుంచే అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని,దేశ రాజకీయాల్లో ముఖ్యంగా వామపక్ష రాజకీయాల్లో వారు క్రియాశీలక పాత్ర పోషించారని,వారి మరణంతో దేశం ఒక గొప్ప ప్రజాస్వామిక వాదిని కోల్పోయిందని పేర్కొన్నారు.నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎన్నికైన సురవరం సుధాకర్ రెడ్డి ప్రజా సమస్యల విషయంలో నిరంతరం ముందుండి పోరాటం చేశారని అన్నారు. నిబద్ధతగల నాయకునిగా దేశ రాజకీయాల్లో సురవరం సుధాకర్ రెడ్డి తనదైన ముద్ర వేసుకున్న గొప్ప నాయకుడు వారినీ కోల్పోవడం చాలా బాధాకరం. సురవరం సుధాకర్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని,వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ప్రార్థించారు సురవరం సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## సహస్రిని హత్యపై తీవ్ర ఆవేదన

**ప్రత్యేక చట్టం కోరిన బక్కివెంకటయ్య**



**కూకట్‌పల్లి,ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నగరంలోని కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లో దళిత బాలిక సహస్రినిపై జరిగిన హత్య ఘటనపై రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పట్టపగలే బాలికను హత్య చేయడం అత్యంత దారుణమని పేర్కొంటూ, ఈ కేసును ఎస్సీ ఎస్టీ అట్రాసిటి చట్టం కింద నమోదు చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.శనివారం బాలిక తల్లిదండ్రులు కృష్ణ, రేణుకలను పరామర్శించిన బక్కివెంకటయ్య, "ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సహస్రిని పేరుతో ప్రత్యేక చట్టం రూపొందించాలని ప్రభుత్వానికి నివేదిస్తా" అని తెలిపారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం, పక్కా గృహం, ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు."నా బిడ్డను కోల్పోయాను, ఇక ఏ బిడ్డ ఇలాంటి దారుణానికి గురికాకూడదు" అంటూ తల్లి రేణుక కన్నీటి పర్యంతమయ్యారు. ఇంట్లో ఒంటరిగా వదిలి వెళ్లాలంటే భయంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్, మాల మహనాడు, బీఎస్పీ నాయకులు సహా పలువురు సామాజిక నేతలు పాల్గొని కుటుంబానికి మద్దతు ప్రకటించారు.ఈ ఘటనపై దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతుండగా, ముగ్గురు అనుమానితులను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. సంఘటన స్థలంలో సీసీ కెమెరా ఆధారాలు, ఫింగర్‌ప్రింట్‌లు సేకరించి, అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

## ఎమ్మెల్యే కవ్వంపల్లిని పరామర్శించిన మంత్రులు



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణని ఆయన కరీంనగర్ స్వగృహంలో శుక్రవారం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన కవ్వంపల్లి రాజేశం చిత్రపటానికి పూలమాలలు వేసి గౌరవ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, డిటిసి పురుషోత్తం, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని మంత్రులు భరోసా ఇచ్చారు.

## నాగర్‌కర్నూల్‌లో ఆర్ఐ స్టోర్ ప్రారంభించిన జిల్లా ఎస్పీ




**నాగర్‌కర్నూల్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలోని ఓల్డ్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వద్ద ఆర్ఐ స్టోర్ను జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఐపీఎస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు లైట్లును కూడా ప్రారంభించారు. ఈ స్టోర్‌లో ఆర్మ్ రిజర్వ్ ఫోర్స్కు అవసరమైన వివిధ రకాల పోలీసు సామగ్రి భద్రపరిచి, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు సిద్ధంగా ఉంచనున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జగన్, ఎస్సై గోవర్ధన్, ఆర్ఎస్ఐలు గౌస్ పాషా, కళ్యాణ్, ప్రశాంత్, శివాజీ తదితరులు పాల్గొన్నారు. దాదాపు 50 మంది ఏఆర్ సిబ్బంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## తండ్రి జ్ఞాపకంగా కళాశాలకి విరాళం



**షాద్‌నగర్, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):** షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం అందజేస్తూ విజయ్ కుమార్ తన తండ్రి దివంగత ఉపాధ్యాయుడు కుంచెం శ్రీశైలం జ్ఞాపకాన్ని సజీవంగా నిలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా చెక్కును అందజేసిన విజయ్ కుమార్ ఔదార్యాన్ని ఎమ్మెల్యే ప్రశంసించారు."శ్రీశైలం నాకు గురువు లాంటి వారు. వారి కుటుంబంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఈ విరాళం విద్యార్థుల భవిష్యత్తుకు వెలకట్టలేని బహుమతి" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దామోదర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వంగూరులో టి ఎల్ ఎం మేళా ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ, కేవీఎన్ రెడ్డి



**వంగూరు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో టిఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్) మేళా ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కెవిన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. విద్యా బోధనను మరింత ప్రభావవంతంగా మార్చే లక్ష్యంతో ఉపాధ్యాయులు రూపొందించిన బోధన సామగ్రిని ఈ మేళాలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా డీఈఓ రమేష్ కుమార్, మండల ఎంఈఓ మురళీమోహనా చారి, రంగాపూర్ హెచ్ఎం సుధారాణి, వే మరియు వేదమూర్తి, ఫజల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, సింగల్ విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, క్యామా మల్లయ్య, జనార్ధన్ మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ, విద్యా ప్రమాణాలను మెరుగుపరచే దిశగా ఈ మేళా చర్చలకు వేదికగా నిలిచింది.

## కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతి కి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే

### ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.



**దేవరకొండ, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సిపిఐ అగ్ర నాయకులు,మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మరణం పట్ల దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియచేశారు. నల్గొండ పార్లమెంట్ సభ్యునిగా రెండు పర్యాయాలు ఎన్నికైన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి నల్గొండ జిల్లా ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు.నిబద్దత గల నాయకునిగా దేశ రాజకీయాల్లో తన దైన ముద్ర వేసుకున్న గొప్ప నాయకున్ని కోల్పోయామని,వారి ఆత్మకు శాంతి చేకూరాలని,సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

## బీసీ రిజర్వేషన్ల అమలుకు సత్య గ్రహ దీక్ష

### హైదరాబాదులో ఆగస్టు 25న

**ఎలిగేడు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీ రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో "సత్య గ్రహ దీక్ష" కార్యక్రమం ఈ నెల 25న సోమవారం హైదరాబాదులో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంఘం కన్వీనర్ బింగి రాజు ఒక ప్రకటనలో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల్లోని బీసీలు దీక్షకు భారీగా తరలిరావాలని కోరారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు కోసం చేపట్టిన ఈ దీక్ష, బీసీ హక్కుల సాధనకు కీలకంగా నిలవనుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న నేపథ్యంలో, ఈ దీక్ష ద్వారా బీసీ వర్గాల ఆకాంక్షలను ప్రభుత్వానికి తెలియజేయాలన్నదే లక్ష్యమని తెలిపారు.

## జనహిత పాదయాత్ర ఏర్పాట్లపై చొప్పదండిలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమీక్ష



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రామగుండం శాసనసభ్యులు గౌరవ ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఈరోజు చొప్పదండి నియోజకవర్గంలో పర్యటించారు. రేపు, ఆగస్టు 24న తెలంగాణ పీసీసీ ఆధ్వర్యంలో జరగనున్న జనహిత పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన చొప్పదండి ఎమ్మెల్యే గౌరవ మేడిపల్లి సత్యతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తేవడమే కాకుండా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం ఈ పాదయాత్ర లక్ష్యమని ఆయన వివరించారు. చొప్పదండి నియోజకవర్గంలో పాదయాత్ర విజయవంతం కావడానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజనులు, మహిళా కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులకు లబ్ధి చేరేలా చర్యలు తీసుకోండి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ, ఆగస్టు 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ పథకం కింద 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ప్రాథమిక ఆదాయ వనరు అయిన కుటుంబ పెద్ద సహజంగా లేదా ప్రమాదవశాత్తు మరణించినప్పుడు, వారి కుటుంబానికి ఒక్కసారిగా రూ.20,000 నగదు సహాయం అందించనుందని ఆమె తెలిపారు. మరణం జరిగిన రెండు సంవత్సరాల లోపు దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. అంత్యోదయ అన్నా భీమా యోజన, జన శ్రీ భీమా యోజన లబ్ధిదారులు ఈ పథకానికి అర్హులు కాదని పేర్కొన్నారు.దరఖాస్తు చేసేవారు తహసీల్దార్ కార్యాలయంలో మరణ ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత గుర్తింపు, చిరునామా రుజువు, రేషన్ కార్డు లేదా పేదరిక ధ్రువీకరణ పత్రం, ఆధార్ లింక్డ్ బ్యాంకు లేదా పోస్టాఫీస్ ఖాతా వివరాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో కూడిన దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. నల్లగొండ జిల్లాలో 3,500 మందికి లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని కలెక్టర్ తెలిపారు. జనవరి 1, 2024 నుండి మరణించిన వారి వివరాలను గ్రామపంచాయతీ కార్యదర్శులు మరణ రిజిస్టర్ ఆధారంగా ఎంపీడీవోలకు పంపించాలని, ఎంపీడీవోలు పరిశీలించి తహసీల్దార్లకు జాబితా అందించాలని ఆమె ఆదేశించారు. మున్సిపల్ స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు జాబితా సమర్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చేలా ఆర్డీవోలు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఏపీఎంలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు ఈ అంశంపై సమన్వయ సమావేశాలు నిర్వహించి, వచ్చే శనివారం లోపు తహసీల్దారులు పూర్తి విచారణ జరిపి ఆర్డీవోకు దరఖాస్తులను పంపించాలని, ఆర్డీవోలు వాటిని ఆన్‌లైన్ ద్వారా జిల్లా రెవెన్యూ అధికారికి పంపించాలని ఆమె స్పష్టం చేశారు. అర్హత కలిగిన దరఖాస్తులు ప్రభుత్వానికి చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ఎన్టీఆర్ నగర్‌లో పాదయాత్ర చేసిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**ఆల్విన్ కాలనీ,ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ చాలిస్ మకాన్ కాలనీలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా డ్రైనేజీ పొంగి వరద నీరు రోడ్లపై ప్రవహిస్తూ స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా, ఆయన స్వయంగా కాలనీలో పాదయాత్ర నిర్వహించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నివాసాలు పెరగడంతో గతంలో నిర్మించిన చిన్న డ్రైనేజీ లైన్ నిత్యం నిండిపోతూ సమస్యలు తలెత్తుతున్నాయని, శాశ్వత పరిష్కారంగా పెద్ద డ్రైనేజీ లైన్ నిర్మాణానికి ఎస్టిమేషన్ సిద్ధం చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. వరద నీరు ఇండ్లలోకి ప్రవేశించకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, GHMC, మాన్సున్, హైడ్రా సిబ్బంది సకాలంలో స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. వర్షాకాలంలో ఎలక్ట్రికల్, రోడ్డు, డ్రైనేజీ, మంచి నీటి సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులను లేదా తన కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రజలకు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, డిజాస్టర్ మేనేజ్మెంట్ టీమ్స్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టిగౌడ్, మల్లేష్, ప్రభాకర్, వాలి నాగేశ్వరరావు, భిక్షపతి, మధులత, నస్రీన్ తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు. వర్షాలతో ఏర్పడుతున్న సమస్యలపై ప్రజలతో కలిసి నడుచుకుంటూ పరిష్కార మార్గాలు సూచించిన కార్పొరేటర్ చర్యలు స్థానికంగా ప్రశంసలు పొందుతున్నాయి.

## గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరగాలి

### డీఎస్పీ శివరాం రెడ్డి




**నల్లగొండ, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పట్టణంలో శాంతి, భద్రతలపై సమీక్ష సమావేశం శనివారం స్టార్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు, సబ్ డివిజన్ డీఎస్పీ కె. శివరాం రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పీస్ కమిటీ సభ్యులు, గణేష్ మండప నిర్వాహకులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ప్రజలకు సూచించారు. మండపాల ఏర్పాటులో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, మైక్ సెట్‌ల శబ్దం ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదని తెలిపారు. మండపాలను రోడ్డు మధ్యలో కాకుండా ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని, టపాకాయలు, అగ్ని ప్రమాదానికి దారితీసే వస్తువులు నిషేధించాలన్నారు. డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేసిన ఆయన, వినిపించినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాంస్కృతిక కార్యక్రమాలకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ అనుమతి తప్పనిసరి అని, రాత్రి 10 గంటల లోపు వాటిని ముగించాలన్నారు. మండపం వద్ద అనుమానాస్పద వస్తువులు కనిపించినచో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అగ్ని ప్రమాద నివారణకు ఇసుక బస్తాలు, నీటి బకెట్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో అశోక్ రెడ్డి మాట్లాడుతూ, భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. వన్ టౌన్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మయ్య, మున్సిపల్ కమిషనర్, గ్రంథాలయ చైర్మన్ హఫీజ్ ఖాన్, పీస్ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలను అమలు చేయాలంటూ ఎమ్మార్వోకు బీజేపీ వినతిపత్రం



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై వినతిపత్రం సమర్పించారు. మండల అధ్యక్షులు కాట్రవాతి జ్యోతి నేతృత్వంలో ఎమ్మార్వో సైదులకు వినతిపత్రం అందజేయగా, కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. "మా లక్ష్మి" పథకం కింద ప్రతి మహిళకు నెలకు 2500, 500కు గ్యాస్ సిలిండర్, రైతు భరోసా కింద ఎకరానికి 15,000, రెండు లక్షల రూపాయల రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ?12,000, వరి పంటకు ?500 బోనస్ వంటి హామీలు నామమాత్రంగా మిగిలిపోయాయని తెలిపారు. అదే విధంగా విద్యార్థులకు 5 లక్షల విద్యా భరోసా, నిరుద్యోగులకు నెలకు 4000 భృతి, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. మొత్తం 420 హామీలను ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని వెంటనే అమలు చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రేలయ్య, జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అఖిల్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పొలం ఆంజనేయులు, నాయకులు నోముల బాలకృష్ణ యాదవ్, కమల చందులాల్, గండికోట తిరుపతయ్య, సురకరం కాశన్న, బాలా గౌడ్, దేవేందర్ రెడ్డి, గణేష్, సతీష్, రవీందర్ తదితరులు పాల్గొన్నాం

# వానాకాలానికి యూరియా కొరత : చిన్నారెడ్డి ధ్వజం



**వనపర్తి,ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్రానికి అవసరమైన యూరియా సరఫరాను కేంద్రం కుట్రపూర్వకంగానే అడ్డుకుంటోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి ఆరోపించారు. ఈ వానాకాలానికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావలసి ఉండగా ఇప్పటి వరకు కేవలం 5.36 లక్షల టన్నులు మాత్రమే అందాయని, దాంతో దాదాపు మూడు లక్షల టన్నుల కొరత ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను పట్టించుకోకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సప్లై నిలిపివేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి జీ. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. రాంచందర్ రావు రైతుల పక్షాన నిలిచి ప్రధాని వద్ద ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. కానీ రైతుల కష్టాలు తెలియని రాంచందర్ రావు అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.బీ.ఆర్.ఎస్. ప్రభుత్వ కాలంలోనూ 2018, 2023 సంవత్సరాల్లో యూరియా కొరత ఏర్పడిందని గుర్తుచేశారు. అప్పట్లో నల్లగొండలో రైతులు యూరియా కోసం క్యూ కట్టిన ఘటనను రేవంత్ రెడ్డి స్వయంగా చూసారని, సమస్యలు పరిష్కరించకుండా ఏడుగురు వ్యవసాయ శాఖ అధికారులను సస్పెండ్ చేసిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదని అన్నారు. గత మూడు సంవత్సరాల గణాంకాలను ప్రస్తావించిన చిన్నారెడ్డి - 2023లో 10.51 లక్షల మెట్రిక్ టన్నుల అవసరానికి 8.75 లక్షల టన్నులు, 2024లో 10.89 లక్షల టన్నుల అవసరానికి 8.14 లక్షల టన్నులు మాత్రమే, 2025లో 8.3 లక్షల టన్నుల అవసరానికి కేవలం 5.42 లక్షల టన్నులే కేంద్రం పంపిందని తెలిపారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాలను మోడీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని తీవ్రంగా విమర్శించారు. అయినా కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అధికారులు నిరంతరంగా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతూ, యూరియా రవాణాకు రైళ్లు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నారని వివరించారు. ఈ సీజన్‌లో వరి, పత్తి, మొక్కజొన్న సాగు విస్తీర్ణం భారీగా పెరిగిందని, రైతుల కోసం ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చిన్నారెడ్డి స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి గంధసిరి రంజిత్ తోడ్పాటు




**కురవి, ఆగస్టు23 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** కురవి మండలం నల్లెల్ల ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత శిఖరాలకు ఎదిగి తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాల మీద అభిమానంతో పూర్వ విద్యార్థి గంధసిరి రంజిత్ ఎంపీయూపీఎస్ నల్లెల్ల ప్రభుత్వ పాఠశాలకు రూ.8500 విలువగల సౌండ్ బాక్స్ ను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ పాఠశాలల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడం, నిర్మాణ పనులలో (ఉదాహరణకు, స్టేజి, వంటగదుల నిర్మాణం) పాలుపంచుకోవడం, అదనపు గదుల నిర్మాణంలో తోడ్పాటు అందించడం, మరియు పరికరాలు, ఫర్నీచర్‌ను విరాళంగా ఇవ్వడం ద్వారా సహాయపడగలరు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించడానికి పూర్వ విద్యార్థులు తమ సంఘాలను (పూర్వ విద్యార్థులు ఒకొక క్లాస్ బ్యాచ్ గా) ఏర్పాటు చేసుకోవడం ద్వారా పాఠశాల ను అభివృద్ధికి సమష్టిగా కృషి చేయవచ్చు అని ఉపాధ్యా తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతంపై విస్తృత స్థాయి సమీక్ష



**హుస్నాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం హుస్నాబాద్ నియోజకవర్గంలో శనివారం జరిగింది. టీటీడీ బోర్డు సభ్యులు, పార్టీ ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి సాగర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజలింగం, జనరల్ సెక్రటరీ దామోదర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గాల వారీగా పార్టీ బలోపేతంపై చర్చించారు. రానున్న రోజుల్లో పార్టీకి మరింత బలం చేకూర్చే కార్యాచరణను రూపొందించాలని నేతలు సూచించారు. సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్

### పాదయాత్రపై బీజేపీ విమర్శ



**గంగాధర, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గంగాధర మండలం మధురనగర్ గ్రామంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఆర్థిక సాయం, వృద్ధులకు పెన్షన్, విద్యార్థులకు భరోసా వంటి హామీలు అమలుకాకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కేంద్ర నిధులతో జరుగుతున్న అభివృద్ధిని కాంగ్రెస్ తమదిగా ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. రేపు గంగాధర మండలంలో జరగనున్న కాంగ్రెస్ పాదయాత్రకు ముందు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలు, మహిళలు, యువత యాత్రను అడ్డుకుంటారని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే హామీలను నెరవేర్చలేదని, చెప్పదండి నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ప్రజలను మోసం చేశాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని అన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగిత్యాలలో టీపీసీసీ లీగల్ సెల్ సమావేశం



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జగిత్యాలలో జరిగిన టీపీసీసీ లీగల్ సెల్ సమావేశంలో కరీంనగర్ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ మాట్లాడుతూ, లీగల్ సెల్‌ను బలోపేతం చేయడమే లక్ష్యమని, న్యాయవాదులకు ఇచ్చిన హామీలు త్వరలో అమలవుతాయని తెలిపారు. సమావేశంలో కల్లెపల్లి లక్ష్మయ్య, భుక్య రజనీష్, కొత్త ప్రకాశ్, కూర శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల స్కాలర్షిప్స్ చెల్లించండి

### ప్రభుత్వంపై గిరిజన సంఘం ఆగ్రహం




**హుస్నాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో విద్యార్థుల స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంపై తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా సాహెబ్ తీవ్రంగా స్పందించారు. హుస్నాబాద్ కలెక్టరేట్ ఎదుట ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫీజు దీక్షకు సంఘీభావంగా పాల్గొన్న ఆయన, ప్రజా ప్రతినిధుల జీతాలు నిలిపివేసి విద్యారంగానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చిన ప్రభుత్వ వైఖరి దేశ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రూ.8150 కోట్ల బకాయిలు వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. హాల్ టిక్కెట్లు, సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీలు ఒత్తిడి తేవడం విద్యార్థులపై అన్యాయమని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని తక్షణమే బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన




**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తిమ్మాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కరీంనగర్ సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ నరసింహారెడ్డి ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.బ్యాంక్ ఓటీపీ, ఆధార్ వివరాలు పంచుకోవడం వల్ల కలిగే నష్టాలు, ఫిషింగ్ సందేశాలు, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలపై పోలీసులు వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యాసంస్థలు 87126 65866 నంబర్‌కు సంప్రదించి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చని తెలిపారు.

## వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి



**బెల్లంపల్లి, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భీమిని మండలంలో ఇటీవల సంభవించిన వరదల ప్రభావిత ప్రాంతాలను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి శనివారం స్వయంగా పర్యటించారు. కన్నెపల్లి, భీమిని, సాలిగం, వెంకటపూర్ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరదల వల్ల దెబ్బతిన్న పంటలు, ఇళ్లు, మౌలిక సదుపాయాలను పరిశీలించిన ఆయన, ప్రజలు అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, అవసరమైన సహాయం అందిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## కొత్తగూడ-గంగారం మండలాల్లో 'పనుల జాతర -25' ఘనంగా



**మహబూబాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'పనుల జాతర -25' కార్యక్రమం భాగంగా మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) శుక్రవారం కొత్తగూడ, గంగారం మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అంగన్వాడి కేంద్రం, ప్రజా పరిషత్ కార్యాలయం, రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటి, గంగారం రైతు వేదికలో 825 లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా సన్నబియ్యం పథకం, వడ్డీలేని రుణాలు, ఉచిత విద్యుత్, గృహ జ్యోతి, మహా లక్ష్మీ పథకాలతో పేద, బలహీన వర్గాల అభ్యున్నతికి ఇందిరమ్మ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. యూరియా కొరత నివారణకు కేంద్రంతో చర్చలు జరిపి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి

### సీపీఐ ఎంఎల్ మాస్ లైన్




**రామగుండం, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పారిశుధ్య పనుల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రజా ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో మురికి కాలువలు, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, దోమలు, ఈగల వల్ల జ్వరాలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. హెల్త్ సెంటర్లలో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, శానిటేషన్ పనులు ముమ్మరం చేయాలని జాయింట్ కలెక్టర్ అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా నాయకులు పుల్లూరి నాగభూషణం, గూడూరి వైకుంఠం, కలువల రాయమల్లు, ఇనుగాల రాజేశ్వర్, చిలుక రాజు, ఇరికిల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో ద్విచక్ర వాహనాలు ఢీ

## యువకుడు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు



**హుస్నాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మండలం మడద గ్రామ సమీపంలో శనివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మడదకు చెందిన బూడిద అజయ్ (28) తన తల్లి పద్మతో కలిసి యాక్టివా ద్విచక్ర వాహనంపై పాల కేంద్రానికి వెళ్తుండగా, ఎదురుగా వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో అజయ్ తలకి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి పద్మ, మరో బైక్‌పై ఉన్న నమ్మిలికొండ రామకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. పద్మను కరీంనగర్ సివిల్ హాస్పిటల్‌కు, రామకృష్ణను సిద్ధిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు అజయ్ ఇటీవలే వివాహం చేసుకుని, ఆరు నెలల బాబు ఉన్నాడు. ఈ ప్రమాదంతో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. అజయ్ హుస్నాబాద్‌లో మొబైల్ షాపులో పనిచేస్తుండగా, పద్మ హనుమకొండ రోడ్డులో టీ కొట్టు నడుపుతోంది. స్థానికులు ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# విలువలతో కూడిన పాత్రికేయులుగా ఎదగాలి

## -కరీంనగర్‌లో జర్నలిజం కోర్సు వీడ్కోలు



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో జర్నలిజం సర్టిఫికెట్ కోర్సు వీడ్కోలు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ప్రముఖ కవి, పాత్రికేయుడు అన్నవరం దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై, పాత్రికేయ వృత్తి సాహసంతో కూడుకున్నదని, పరిశీలన, వాస్తవికత, నిష్పాక్షికత పాత్రికేయుని ఆభరణాలని పేర్కొన్నారు. విలువలతో కూడిన పాత్రికేయులుగా ఎదగాలంటే నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కలువకుంట రామకృష్ణ, తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కోర్సు సమాజం కోసం మేలుకలిగించే శైలిలో సాగిందని తెలిపారు. వార్తలు సంచలనాలకన్నా సందర్భ శుద్ధితో ఉండాలని సూచించారు. విభాగాధ్యక్షులు డా. బూర్ల చంద్రశేఖర్ పాత్రికేయ వృత్తిని పరమ పవిత్రంగా అభివర్ణిస్తూ, ప్రజల క్షేమం కోసం ఉపయోగించాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులకు భరోసా

## జిల్లాలో యూరియా కొరత లేదని ఎమ్మెల్యే విజయరమణ



**సుల్తానాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు శనివారం సింగిల్ విండో కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాలో వర్షాకాలం పంటలకు అవసరమైన యూరియా సరఫరా పకడ్బందీగా జరుగుతోందని, రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంటల అంచనా ప్రకారం యూరియా పంపిణీ చేస్తోందని, 21,581 మెట్రిక్ టన్నుల యూరియా మార్కెట్లో అందుబాటులో ఉందని తెలిపారు. కొత్త సాగు కోసం 65 టన్నుల యూరియా అవసరమని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.కేంద్ర ప్రభుత్వం యూరియా సరఫరాలో విఫలమైందని విమర్శించిన ఆయన, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ 78 రోజులుగా మూతపడి ఉందని, దానిని తెరిపించే బాధ్యత కేంద్రానిదేనన్నారు. కాంగ్రెస్ ఎంపీల నిరసనకు ప్రియాంక గాంధీ మద్దతు పలికినట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన అనగాని శివప్రసాద్

**నిజాంపట్నం.ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో నిజాంపట్నం మండలం, బావాజీపాలెం అదవల గ్రామానికి చెందిన బడుగు శివాజీ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం సహాయ నిధినుండి మంజూరైన 61 వేల 200 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బడుగు శివాజీ కుటుంబ సభ్యులకు అందచేసిన అనగాని శివప్రసాద్.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతుల ప్రతిష్ఠాపనకు చైతన్యం

## - కరీంనగర్ జిల్లా అధికారుల చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతుల ప్రతిష్ఠాపనను ప్రోత్సహిస్తూ, కరీంనగర్ జిల్లా కలెక్టర్, సీపీ, అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా అవగాహన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించి, మట్టి విగ్రహాల వినియోగంపై చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు.బొమ్మకల్ డివిజన్‌కు చెందిన యువకులు గాయత్రి పర్యావరణ సంస్థ పేరుతో స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి, పలు కాలనీల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పీవోపీ విగ్రహాల వల్ల వాతావరణ కాలుష్యం, నీటి నాణ్యతపై ప్రభావం వంటి అంశాలను ప్రజలకు వివరించి, మట్టి గణపతుల ప్రతిష్ఠాపనను ప్రోత్సహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రైల్వే బోర్డు సభ్యులు పాశం తిరుపతి, సీనియర్ నాయకులు ఆశీర్వది తిరుపతి, దళిత మోర్చా నాయకులు గాలిపెల్లి నారాయణ, కాల్వ రామచంద్రం, పెద్ది లక్ష్మణ్, మెర్గావేన శ్రీకాంత్, కాల్వ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కొడవటంచ ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గండ్ర



**భూపాలపల్లి, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రేగొండ మండలంలోని కొడవటంచ గ్రామంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం సాయంత్రం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర పరిశీలించారు. గర్భగుడి పరిసరాలతో పాటు ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను గుత్తేదారులతో, కాంగ్రెస్ నేతలతో కలిసి పరిశీలించిన ఆయన, పనులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గూడెపల్లి గ్రామానికి చెందిన మృతులైన సిరికొండ అమృతా రావు కుటుంబాన్ని పరామర్శించి, వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## భూపాలపల్లి యూఆర్ఎస్ స్కూల్ ఘటనపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సీరియస్



**భూపాలపల్లి, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గాంధీనగర్ ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కలుషిత నీరు తాగి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీవ్రంగా స్పందించారు. శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి స్కూల్‌ను సందర్శించి, విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే, మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. 24 గంటల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచాలని సూచించారు. ఈ ఘటన వెనుక ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, టీచర్ల మధ్య విభేదాల కారణంగా విద్యార్థులపై కుట్ర జరిగిందని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్‌లోని దగ్గు మందు సీసాలో పురుగుమందు ద్రావణం ఉన్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## విధిలో గాయపడిన హోంగార్డుకు ఆర్థిక సాయం

### మానవత్వం చాటిన కరీంనగర్ కమిషనర్



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విధి నిర్వహణలో హై బీపీ కారణంగా కంటి చూపు కోల్పోయిన హోం గార్డు శివకుమార్‌కు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ మానవత్వంతో అండగా నిలిచారు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో బ్లూ కోల్ట్స్ విధుల్లో ఉన్న శివకుమార్‌కు స్థానికంగా చికిత్స అందించినా ప్రయోజనం లేక, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ రూ. 1.5 లక్షల ఆర్థిక సహాయం అందించగా, శివకుమార్ కంటి చూపు తిరిగి వచ్చి ఈరోజే విధుల్లో చేరారు. కమిషనర్ చొరవను శివకుమార్ కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు హృదయపూర్వకంగా అభినందించారు. పోలీసు కుటుంబంలో ఎవరికి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామని, మానవతా విలువలతో ముందుకు సాగుతామని కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు.

# ఆదివాసి హక్కుల కోసం వరంగల్ బహిరంగ సభకు పిలుపు



**రామగుండం, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. రామగుండం కార్పొరేషన్ న్యూ పోరాటపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో, ఆగస్టు 24న వరంగల్‌లో జరగనున్న బహిరంగ సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముడిమడుగుల మల్లన్న, మార్షల్ దుర్గం నాగేష్, వినోద్, రత్నకుమార్ తదితరులు మాట్లాడుతూ, కేంద్రం ఆదివాసీల హక్కులను పరిగణనలోకి తీసుకోకుండా అమానుషంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సభకు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.మేధావులు, బుద్ధిజీవులు, విద్యార్థులు, జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆత్రం చంద్రయ్య, భూమయ్య, రమేష్, హరీష్, నరసయ్య, చీకటయ్య, భీమన్న, స్వామి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# పలిమెల మండలానికి నూతన పరిషత్ కార్యాలయం

## - కోటి 50 లక్షల నిధులు మంజూరు



**-మంథని, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని పలిమెల మండలానికి నూతన మండల పరిషత్ కార్యాలయం నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం కోటి 50 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసింది. ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఈ నిధుల మంజూరు జరిగిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యాలయం ద్వారా పంకెన, దమ్మురు, సర్వాయిపేట, లెంకల గడ్డ, మోదేడు, నీలంపల్లి, ముకునూరు వంటి గ్రామాలకు ప్రభుత్వ పథకాలు మరింత సమర్థంగా చేరవచ్చునని పేర్కొన్నారు. మండల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రజా హామీల అమలుపై కొత్తపల్లి రూరల్ బీజేపీ ధర్నా



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస్, కొత్త ఆసరా పెన్షన్‌లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కొత్తపల్లి రూరల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద బీజేపీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు కుంట తిరుపతి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి, వాటిని నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. నిరుపేదలకు గృహాలు, నిరుద్యోగులకు ఉపాధి, వితంతువులు, వికలాంగులకు పెన్షన్‌లు మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై స్పందించకపోతే ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని బీజేపీ నేతలు హెచ్చరించారు. ఈ ధర్నాలో జిల్లా కౌన్సిల్ మెంబర్ వేముల అనిల్, మండల అధ్యక్షులు కడార్ల రతన్ కుమార్, జవ్వాజి రమేష్, బోనాల నరేష్, కడారి శ్రీనివాస్, బైరెడ్డి వంశీ, బోయినీ మహేందర్, చిన్నబోయిన శ్రీనివాస్, జిందం సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని భూపాలపల్లిలో రన్ కార్యక్రమం



**భూపాలపల్లి,ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శనివారం యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే హాజరై జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. క్రీడల ద్వారా యువతలో శక్తి, శ్రమ, సమర్పణ భావన పెంపొందుతుందని నేతలు పేర్కొన్నారు.

# ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ సంకల్పం

## జనహిత పాదయాత్ర ఏర్పాట్లపై సమీక్ష



**హనుమకొండ, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గంలో ఆగస్టు 25, 26 తేదీల్లో నిర్వహించనున్న జనహిత పాదయాత్ర ఏర్పాట్లపై హనుమకొండలో సమీక్ష సమావేశం జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, ధనసరి అనసూయ (సీతక్క), పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ, గత 20 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ పాదయాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సాగుతున్న పాలనను ప్రజలకు వివరించేందుకు ఈ యాత్ర దోహదపడుతుందని పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నేతృత్వంలో యాత్ర విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జనహిత పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలన్నదే ఈ యాత్ర లక్ష్యమని మంత్రి వివరించారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల అభివృద్ధి, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎర్రబెల్లి స్వర్ణ, బస్వరాజు సారయ్య, కడియం కావ్య, రాజ్ ఠాకూర్, యశస్విని రెడ్డి, చిట్ల సత్యనారాయణ, బత్తిని శ్రీనివాస్ రావు, మేయర్ గుండు సుధారాణి, తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు పరమపదించిన సీపీఐ నేత సురవరం సుధాకర్ రెడ్డికి మౌనం వహిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో పాదయాత్రకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఐకమత్యంతో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# బీసీ 42 శాతం రిజర్వేషన్ల అమలే లక్ష్యంగా 'చలో హైదరాబాద్'

## ఆగస్టు 25న సత్యాగ్రహ దీక్ష



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈనెల 25న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నట్లు బీసీ సంఘాల నాయకులు ప్రకటించారు. కరీంనగర్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు.బీసీ 42 శాతం రిజర్వేషన్ల అమలే దీక్ష ప్రధాన లక్ష్యమని, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో బీసీ సంఘాల నాయకులు, మేధావులు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లను అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అది మల్లేశం పటేల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసుపెద్ది శ్రీధర్, చిగుర్ల శ్రీనివాస్, నర్సింగోజు శ్రీనివాస్, గుంటి స్వరూప, రవీంద్ర చారి, అనుమాస నితిన్, పెద్ది శ్రీనివాస్, నల్లగొనీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రైబల్ విద్యా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది

## హన్మకొండలో మంత్రి సీతక్క



**వరంగల్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రం విద్యా రంగంలో గిరిజన విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. శనివారం హన్మకొండ బాల సముద్రంలో ఉన్న ట్రైబల్స్ వెల్‌ఫేర్ స్టడీ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఆమె, విద్యార్థులకు అందుతున్న విద్యా, ఆహార సౌకర్యాలపై ఆరా తీశారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన గురుకుల విద్యాలయాల్లో నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుంటే వారి జీవితాల్లో వెలుగు నింపవచ్చని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోబోటిక్స్ విద్యను సద్వినియోగం చేసుకోవాలి

## కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న రోబోటిక్స్ విద్యను విద్యార్థులు భవిష్యత్తు అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శనివారం సప్తగిరి కాలనీ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులు ప్రదర్శించిన రోబోటిక్స్ ప్రయోగాలను పరిశీలించిన ఆమె, విద్యార్థులతో మాట్లాడి వారి ఆవిష్కరణలపై ప్రశంసలు కురిపించారు. సోహం అకాడమీ ఆధ్వర్యంలో జిల్లాలోని 15 ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా రోబోటిక్స్ శిక్షణ అందించబడుతోంది. థియరీతో పాటు ప్రయోగాత్మకంగా రోబోట్స్ తయారీ, వినియోగంపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. విద్యార్థులు స్వయంగా పరికరాలు రూపొందించి, వాటి వినియోగాన్ని వివరించడం కలెక్టర్‌ను ఆకట్టుకుంది. జిల్లా సైన్స్ మ్యూజియంలో ప్రత్యేక గదిని కేటాయించి రోబోట్స్ ప్రదర్శన ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, సోహం అకాడమీ ఫౌండర్ సహదేవ్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# కాశ్మీర్ గడ్డ రైతు బజార్ సమీకృత మార్కెట్ పనులు వేగవంతం చేయాలి

## మాజీ మేయర్ సునీల్ రావు



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ నగరంలోని కాశ్మీర్ గడ్డ రైతు బజార్ సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీజేపీ నాయకులు, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు సూచించారు. శనివారం ఆయన మార్కెట్ నిర్మాణ స్థలాన్ని సందర్శించి, అభివృద్ధి పనులను పరిశీలించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.10 కోట్ల నిధులతో వెజ్ -నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం స్లాబ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పనుల పురోగతిపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించి, పలు సూచనలు చేశారు. ఆలస్యంగా సాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, డిజైన్ మ్యాప్ ప్రకారం అన్ని వసతులు కల్పించాలని సూచించారు. సెల్లార్ నిర్మాణంలో వరద నీరు ప్రవేశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మార్కెట్ నిర్మాణం జరగాలని కోరారు. వ్యాపారుల కోసం అన్ని రకాల సౌకర్యాలు, స్త్రీ-పురుషులకు వేర్వేరు మాడ్రన్ మోడల్ మరుగుదొడ్లు నిర్మించాలని సూచించారు. పనులను ఆరు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణలో నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం జరగాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ కార్పొరేటర్ తుల శ్రీదేవి, చంద్రమౌళి, కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# వినాయక నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి : డీసీపీ సునీత



**ఇబ్రహీంపట్నం,ఆగస్టు23 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణం నడుమ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని శాస్త్ర గార్డెన్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఏర్పాట్లపై ఉత్సవ సమితి ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి, అడిషనల్ డిసిపి సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కెపివి రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిపి సునీత రెడ్డి, మాట్లాడుతూ... ఈ నెల 27న వినాయక చవితి నవరాత్రులు ఉత్సవాలు ప్రారంభమై సెప్టెంబర్ 6న నిమజ్జనం చేయన్నునందున, వినాయక మండపాలు ఏర్పాటు చేసే భక్తులు, నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో సురక్షిత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగాలని సూచించారు. కేబుల్ వైర్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి, యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి, మంచాల సీఐ మధు, ఆదిభట్ల సీఐ రవికుమార్, ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో వెంకటమ్మ, యాచారం ఎమ్మార్వో అయ్యప్ప, పోలీస్ సిబ్బంది, నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాఘవ కన్స్ట్రక్షన్ నిర్లక్ష్యం

## మిషన్ భగీరథ కార్మికులకు కరెంట్ షాక్



**హుస్నాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ పవర్ ట్యాంకుల వద్ద పని చేస్తున్న ఇద్దరు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన రెండు రోజుల క్రితం చోటుచేసుకోగా, ఎడబోయిన శ్రీకాంత్, బొల్లి పవన్ తీవ్రంగా గాయపడి కరీంనగర్ వన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాఘవ కన్స్ట్రక్షన్ ఏజెన్సీ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఉద్యోగులకు అవసరమైన భద్రతా పరికరాలు ‚ గ్లౌజులు, షూలు ‚ అందించకపోవడం, అలాగే నెలకు 18 వేల జీతం ఇవ్వాల్సిన చోట పదివేలు మాత్రమే చెల్లించడం, ఈపీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి మౌలిక హక్కులు కల్పించకపోవడం వంటి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనపై మిషన్ భగీరథ ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి, రాఘవ ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ పార్టీ డిమాండ్ చేసింది. పార్టీ ఇంచార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, జిల్లా నాయకులు ఎలగందుల శంకర్, నియోజకవర్గ అధ్యక్షులు వెలుపల రాజు బాధితులను పరామర్శించారు.

# కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ డైరీస్' ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కరీంనగర్‌లో శనివారం 'డిగ్రీ డైరీస్' పేరుతో ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. సీనియర్ విద్యార్థినులు కొత్తగా చేరిన జూనియర్లకు స్వాగతం పలికారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి అధ్యక్షత వహించి, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, విద్యార్థినులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్య, క్రీడ, సాంస్కృతిక రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు. ఈ సంవత్సరం కళాశాలలోని అన్ని సీట్లు దోస్త్ ద్వారా కేటాయించబడ్డాయని, 95% పైగా మార్కులు సాధించిన విద్యార్థినులు కళాశాలను ఎంచుకోవడం గర్వకారణమన్నారు. గత సంవత్సరం విద్యార్థినులు క్రీడా పోటీల్లో, గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొని ప్రతిభను చాటారని, ఈ సంవత్సరం కూడా విద్యతో పాటు అన్ని రంగాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పరీక్షల నియంత్రణాధికారి డా. జి. శ్రీనివాస్ విద్యాసంవత్సర పరీక్షల వివరాలను విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. టి.ఎస్.కె.సి. మరియు ఉమీద్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ పూర్తి చేసిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ జే.వి. రాజి రెడ్డి, అఫ్సరీ ఉస్మాని, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు, అకడమిక్ కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి, మిలాద్ ఉల్ నబీ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు





### కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉల్ నబీ పండుగలు ప్రశాంత వాతావరణంలో జరగాలన్న లక్ష్యంతో శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. మున్సిపల్, విద్యుత్, పోలీస్ శాఖల సమన్వయంతో ఏర్పాట్లపై చర్చ జరిగింది. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, నిమజ్జన రూట్లలో విద్యుత్ తీగలపై అప్రమత్తంగా ఉండాలని, రూట్ క్లియరెన్స్ సమర్పించాలని, లైటింగ్, శానిటేషన్, బ్లీచింగ్ పనులు మున్సిపల్ ఆధ్వర్యంలో పక్కాగా చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు, షిఫ్ట్‌ల వారీగా ఈతగాళ్లు, బోట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌ను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, విగ్రహాలను నిమజ్జనానికి తరలించే రూట్లలో మరమ్మతులు చేయాలని, గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తామని, మిలాద్ ఉల్ నబీ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, నగరంలో సుమారు 3300 గణేష్ విగ్రహాలు ఏర్పాటు అవుతున్నాయని, నిర్వాహకులు పోలీస్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాలైన మనకొండూర్, కొత్తపల్లి, చింతకుంట చెరువుల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, డ్రైవర్లు, మెకానిక్‌లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# హతిరాం బావాజీ మఠం కూల్చివేతకు వ్యతిరేకంగా బంజారా జాగృతి ఉద్యమ పిలుపు



**హుస్నాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తిరుపతిలోని చారిత్రక హతిరాం బావాజీ మఠం కూల్చివేతకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న టెండర్ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర బంజారా జాగృతి రాష్ట్ర నాయకుడు లకవత్ వెంకటేష్ నాయక్ డిమాండ్ చేశారు. హతిరాం మఠం బంజారా కమ్యూనిటీ వారసత్వానికి, గుర్తింపుకు ప్రతీకగా నిలిచిందని, దీనిపై ముప్పు ఏర్పడటం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో, మఠం కేవలం భవనం మాత్రమే కాదు, అది తరతరాలుగా బంజారా సమాజానికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా నిలిచిందని అన్నారు. మౌనంగా ఉండటం వల్ల మన చరిత్ర, సంస్కృతి కనుమరుగైపోతుందని, అందరూ ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. హతిరాం బాలాజీ మఠం పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న బంజారల గురు మహంత శ్రీ రమేష్ గురూజీ మహారాజ్ మరియు కమిటీకి ఆర్థికంగా, హృదయపూర్వకంగా సహాయం చేయాలని కోరారు. తిరుపతిలో బంజారా ఉనికి చెరిపివేయకుండా, మఠాన్ని కాపాడేందుకు సమష్టిగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

# యువతను మత్తుపదార్థాల బారిన పడకుండా కాపాడాలి

### కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, యువత మరియు విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు.కలెక్టర్ పేర్కొంటూ, పోలీస్, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన చర్యలు జిల్లాలో మంచి ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. 221 పాఠశాలలు, 70 వసతి గృహాల్లో 26,700 మంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, మిగిలిన విద్యాసంస్థల్లో కూడా త్వరలో కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. షీ టీమ్‌లను కూడా ఈ ప్రచారంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, గత 7 నెలల్లో 75 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 6,550 మంది విద్యార్థులకు మత్తుపదార్థాల అనర్థాలపై చైతన్యం కల్పించామని తెలిపారు. డాగ్ స్క్వాడ్ ద్వారా 11 ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించి 31.360 కేజీల గంజాయిని సీజ్ చేశామని, 16 కేసులు నమోదు చేసి 39 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. 390 డ్రగ్ డిటెక్షన్ కిట్లు తెప్పించి, మత్తు పదార్థాల వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ పుల్లయ్య, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, వైద్యాధికారి వెంకటరమణ, వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, విద్యాశాఖ కోఆర్డినేటర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ చిన్నారులకు ఆటల పోటీలు



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ క్రీడా దినోత్సవ వారోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక అంగన్వాడీ చిన్నారులకు ప్రత్యేకంగా ఆటల పోటీలు నిర్వహించారు. చిన్నారుల ఉత్సాహాన్ని పెంపొందించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రన్నింగ్ పోటీలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.రన్నింగ్ పోటీలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జెండా ఊపి ప్రారంభించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు కలెక్టర్ మెడల్స్ అందజేశారు. చిన్నారుల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి భవిష్యత్తు అభివృద్ధికి క్రీడల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి శ్రీనివాస్ గౌడ్, ఒలింపిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, సిడిపిఓ సబిత, జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చిన్నారుల ఉత్సాహం, పాల్గొనిన అధికారుల ప్రోత్సాహం ఈ కార్యక్రమాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చింది.

# హుస్నాబాద్ అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

### ఎల్లమ్మ చెరువు ఆధునీకరణ పనులకు వేగం





**హుస్నాబాద్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ నియోజకవర్గంలో శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించి, శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో కిషన్ రావుతో కలిసి ఆలయ పరిసరాల్లో పెండింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే చారిత్రాత్మక ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి, రూ.15 కోట్లతో జరుగుతున్న ఆధునీకరణ పనులను బతుకమ్మ, దసరా పండుగల నాటికి పూర్తి చేయాలని సూచించారు. చెరువును టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని, కప్పు గుట్ట, హరిత హోటల్, వాటర్ బోట్స్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాకతీయుల కాలం నాటి చరిత్ర కలిగిన ఎల్లమ్మ చెరువును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఎల్లమ్మ గుడి వద్ద కాంపౌండ్ నిర్మాణం, పండుగల సమయంలో భక్తులకు భోజనాల ఏర్పాటుకు స్థలాన్ని అందుబాటులోకి తేవడం జరుగుతోంది. హుస్నాబాద్ పట్టణ ఆసుపత్రి పనులు వేగంగా సాగుతున్నాయని, పూర్తికాగానే పీజీ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్లమ్మ చెరువు నుండి మల్లె చెట్టు వరకు డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, కొత్త చెరువు అభివృద్ధి, ట్యాంక్ బండ్ నిర్మాణం, జంక్షన్ అభివృద్ధి వంటి పలు ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఇంజినీరింగ్ కాలేజీ, ఇండస్ట్రియల్ పార్క్, మహాసముద్రం గండి టూరిజం ప్రాజెక్ట్, నాలుగు జిల్లాల్లో నాలుగు లైన్ రోడ్లు, జనగాం రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతాంగానికి మేలు చేసే గౌరవెల్లి ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని, కాలువల భుకు రైతులు సేకరించాలని మంత్రి సూచించారు.

# సీపీఐ నేత సురవరం సుధాకర్ రెడ్డికి ఘన నివాళి

### కమ్యూనిస్టు శ్రేణులకు తీరని లోటు



**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల సీపీఐ కరీంనగర్ జిల్లా నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి ఆయన అనారోగ్యంతో కన్నుమూయగా, శనివారం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ, సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుంచే ఉద్యమాల పట్ల నిబద్ధతతో పనిచేసిన నాయకుడని, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ద్వారా యువజన పోరాటాలకు నాయకత్వం వహించారని తెలిపారు. నల్గొండ నుంచి రెండు పర్యాయాలు పార్లమెంటు సభ్యులుగా సేవలందించిన ఆయన, పేద, బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరంగా కృషి చేశారని కొనియాడారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలపై విశదమైన అవగాహన కలిగిన మేధావిగా, తుది శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలకు అంకితంగా జీవించిన ఆదర్శ నాయకుడిగా ఆయనను అభివర్ణించారు. సీపీఐ శ్రేణులు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా నేతలు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, గూడెం లక్ష్మీ, పైడిపల్లి రాజు, కటికరెడ్డి, బుచ్చన్న యాదవ్, న్యాలపట్ల రాజు, బీర్ల పద్మ, బూడిద సదాశివ, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్ల పెల్లి యుగేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మచ్చ రమేష్, రామారపు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఆర్ఎఎఫ్

### -పోలీసుల సంయుక్త ఫ్లాగ్ మార్చ్




**కరీంనగర్, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మతపరంగా సున్నితమైన ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం శుక్రవారం 99వ రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఎఎఫ్) బెటాలియన్‌తో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పరేడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమైన ఈ గస్తీ కరీంనగర్ బస్టాండ్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, శాస్త్రి రోడ్, టవర్ సర్కిల్, రాజీవ్ చౌక్, గాంధీ రోడ్, మంచిర్యాల చౌరస్తా, కోర్ట్ చౌరస్తా, తెలంగాణ చౌక్ వరకు సాగింది. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ మాట్లాడుతూ, ప్రజలకు భరోసా కల్పించడం, ఆర్ఎఎఫ్ సిబ్బందికి ప్రాంతాలపై అవగాహన పెంపొందించడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘటనలను ముందుగానే అరికట్టడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆర్ఎఎఫ్, సాట్ బలగాలతో కలిసి బహిరంగ ప్రదేశాల్లో సందర్శనలు, మాక్ డ్రిల్స్ నిర్వహించారు. స్థానిక పెద్దలు, శాంతి కమిటీ సభ్యులు, పౌర సమాజ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, అత్యవసర పరిస్థితుల్లో స్పందనపై చర్చించారు. ఈ చర్యలు ప్రజలకు భద్రతపై పోలీసుల చిత్తశుద్ధిని, సన్నద్ధతను తెలియజేస్తున్నాయని కమిషనర్ పేర్కొన్నారు.